

మైనేని వెంకటరత్నం

# ఐక్య ఉపాధ్యాయ

ఆంధ్రప్రదేశ్ ఐక్యఉపాధ్యాయ ఫెడరేషన్ అధికార పత్రిక

సంపుటి - 3 సంచిక - 2 కృష్ణా/విజయవాడ జనవరి - 2021 పేజీలు -36 రూ.15.00

## యుటియఫ్ బలపర్చిన పిడిఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థులు

కృష్ణా - గుంటూరు జిల్లాల ఉపాధ్యాయ నియోజకవర్గ అభ్యర్థి



బొడ్డు నాగేశ్వర రావు

ఉభయగోదావరి జిల్లాల ఉపాధ్యాయ నియోజకవర్గ అభ్యర్థి



షేక్ సాబ్జీ

మొదటి ప్రాధాన్యత 1 ఓటు వేసి గెలిపించ ప్రార్ధన

## యుటియఫ్ రాష్ట్ర కార్యాలయంలో డైరీ ఆవిష్కరణ



ప్రభుత్వ నూతన ప్రధానకార్యదర్శి ఆదిత్యానాథ్‌దాస్‌కి అభినందనలు






రాష్ట్ర కేంద్రంలో సావిత్రీబాయిపూలే జయంతి కార్యక్రమం




రాష్ట్ర కార్యాలయంలో చెన్నుపాటి వర్ధంతి




ఎమ్మెల్సీల నిరాహారదీక్ష




ఫ్యాప్టో సామూహిక ధర్నా

## రాష్ట్ర కార్యవర్గం




యుటియఫ్ రాష్ట్ర ప్రధానకార్యదర్శి పి.బాబురెడ్డి



పాల్గొన్న రాష్ట్ర కార్యవర్గ సభ్యులు



కృష్ణా-గుంటూరు ఉపాధ్యాయ నియోజకవర్గ ఎమ్మెల్సీ అభ్యర్థిగా బొడ్డు నాగేశ్వరరావుకు పలు సంఘాల మద్దతు



ఉభయగోదావరి జిల్లాల ఉపాధ్యాయ నియోజకవర్గ ఎమ్మెల్సీ అభ్యర్థిగా షేక్ సాబ్జీకు పలు సంఘాల మద్దతు

# ఐక్యఉపాధ్యాయ

**విద్యా విషయక మాసపత్రిక**

## సంపాదక వర్గం

**టి.ఎస్.ఎల్.ఎన్.మల్లేశ్వరరావు**
సంపాదకులు

సంపాదకవర్గ సభ్యులు
**పొక్కిరెడ్డి బాబురెడ్డి**
**షేక్ సాబ్జీ**
**సిహెచ్.శ్రీహరి**
**పి.రమణారెడ్డి**


## ఈ సంచికలో...


జాతీయం-అంతర్జాతీయం - 4
ఆ కలం ఆ గళం ఎప్పటికీ చైతన్యం... - 5
ఆధునిక విద్య ద్వారానే స్త్రీ విముక్తి... - 7
అసర్ రిపోర్టు - 9
పిల్లల్లో చదువుల ఫోబియా - 11
రైతు ఉద్యమం అందరిది - 13
బతుకమ్మ (కథ) - 15
ప్రశ్నోత్తరాలు - 17
పిడిఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థులు - 18
నిరసన కార్యక్రమాలు - 20
డిఇఓ కార్యాలయాల ముట్టడి - 21
జిల్లాల ప్రాతినిధ్యాలు - 23
సదస్సులు - సమావేశాలు - 24
సావిత్రీబాయి జయంతి వేడుకలు - 26
ప్రభుత్వ ఉత్తర్వులు - 28



| | | |
|---|---|---|
| దశాబ్దిచందా | : | ₹ 1250-00 |
| 5 సం॥ చందా | : | ₹ 650-00 |
| సం॥ చందా | : | ₹ 150-00 |
| విడిప్రతి | : | ₹ 15-00 |

Union Bank Online
A/c No. 346402010025027
IFSC Code : UBIN0534641

**ఐక్యఉపాధ్యాయ**
యుటియఫ్ ఆఫీస్, పాలపర్తివారి వీధి
గవర్నర్‌పేట, విజయవాడ-520002
Ph.No. : 0866-2973763
MobileNo. : 9494112533
Website : www.aputf.org
E-mail : ikyopadhyaya1975@gmail.com


# ఉద్యమ అభ్యర్థులని శాసన మండలికి పంపిద్దాం

రాష్ట్రంలో మార్చి నెలలో రెండు ఉపాధ్యాయ శాసనమండలి స్థానాలకు ఎన్నికలు జరుగనున్నాయి. ఒకటి కృష్ణా-గుంటూరు జిల్లాల ఉపాధ్యాయ నియోజకవర్గం కాగా రెండవది ఉభయగోదావరి జిల్లాల ఉపాధ్యాయ నియోజక వర్గం. ఈ రెండు నియోజకవర్గాలలో పిడిఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థులుగా కృష్ణా-గుంటూరు నుండి బొడ్డు నాగేశ్వరరావు, ఉభయగోదావరి జిల్లాల నుండి యుటియఫ్ రాష్ట్ర అధ్యక్షులు షేక్ సాబ్జీ పోటీ చేస్తున్నారు. వారికి యుటియఫ్ మద్దతు తెలియజేస్తోంది.

2007లో శాసనమండలి పునరుద్ధరించబడిన తర్వాత ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో శాసన మండలి సభ్యులుగా గెలిచిన చుక్కా రామయ్య, డి.రామిరెడ్డి, కె.నాగేశ్వర్, కె.యస్.లక్ష్మణరావు, జార్జీ విక్టర్, వి.బాలసుబ్రహ్మణ్యం, ఎం.వి.ఎస్. శర్మ ప్రొగ్రెసివ్ డెమొక్రటిక్ ఫ్రంట్‌గా ఏర్పడి ఉద్యోగ, ఉపాధ్యాయ, ప్రజా వాణిని శాసనమండలిలో వినిపించారు. వీరందరూ విద్యావంతులు, ఉద్యమ నేతలు. అప్పటి ప్రభుత్వం ఇవ్వజూపిన ఖరీదైన ఇళ్ళ స్థలాలను నిరాకరించి ప్రజాసేవ కోసమే ఎన్నికయ్యాం. తప్ప లాభాపేక్షకోసం కాదని నిరూపించారు. తదుపరి గెలిచిన సభ్యులు డా॥ యం.గేయానంద్‌కూడా వారితో కలిసి ఎనిమిదిమంది పిడిఎఫ్ సభ్యులుగా నిరంతరం శాసనమండలిలో ప్రతిపక్ష పాత్రను సమర్ధవంతం గా పోషించారు.

విద్యారంగ ప్రైవేటీకరణ విధానాలకు వ్యతిరేకంగా శాసనమండలిలో గళం వినిపించారు. అప్రెంటీస్ సమస్య పరిష్కారం, సర్వీస్‌రూల్స్, మున్సిపల్ టీచర్లకు 010 జీతాలు, ఎయిడెడ్ టీచర్ల అధ్యాపక, కాంట్రాక్ట్ లెక్చరర్ల, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల సమస్యలపై ఉద్యమించారు. సంఘాలు చేస్తున్న పోరాటాలను మండలిలో ప్రతిబింబింపజేశారు.

రాష్ట్ర విభజన అనంతరము ఆంధ్రప్రదేశ్‌లో ప్రస్తుతమున్న 5గురు పిడిఎఫ్ ఎమ్మెల్సీలు అదే పంథాను కొనసాగిస్తూ ఉపాధ్యాయుల, అధ్యాపకుల పక్షాన నిలిచారు. పైరవీ బదిలీలకు దూరంగా ఉండటమే కాకుండా వాటిపై ప్రభుత్వాన్ని నిలదీసారు.

నూతన జాతీయ విద్యా విధానంపై ఉపాధ్యాయులలో అవగాహన కల్పించడం కోసం కృషి చేశారు. పాఠశాలలో తెలుగు మీడియం రద్దు చేయాలనే ప్రభుత్వ విధానాన్ని మండలిలో తిప్పికొట్టారు. ఉద్యోగుల పట్ల ప్రభుత్వ వైఖరి అనే అంశాన్ని ప్రత్యేకంగా చర్చకు తీసుకురా గలిగారు. మోడల్ స్కూల్ టీచర్ల సమస్యలుగాని, అధ్యాపకుల సమస్యలుగాని పరిష్కరించడంలో వారికి తమ సహాయ సహకారాలు అందించారు.

ఉపాధ్యాయ బదిలీలలో ప్రభుత్వ అప్రజాస్వామిక వైఖరిని, అధికారుల నిరంకుశ విధానాలకు వ్యతిరేకంగా సంఘాలు చేసిన పోరాటానికి మద్ధతుగా నిరాహారదీక్ష చేశారు.

ప్రస్తుత పాలకులలో ఉపాధ్యాయుల, ఉద్యోగుల సమస్యలను చర్చించాలనే ప్రజాస్వామిక స్ఫూర్తి కొరవడింది. అధికారులు సైతం ఉపాధ్యాయులను, వారికి ప్రతినిధులైన సంఘ బాధ్యుల అభిప్రాయాలను, గౌరవించాలనే ఆలోచన చేయడం లేదు.

ఇటువంటి పరిస్థితులలో ప్రభుత్వాన్ని నిలదీయడానికి, ప్రభుత్వ దృష్టికి సమస్యలు తీసుకెళ్ళడానికి ఉన్న వేదిక శాసనమండలి. ఈ వేదికను ఉపాధ్యాయ ఉద్యోగుల పట్ల సమర్ధవంతంగా వినియోగించగలిగిన వారినే శాసనమండలికి పంపాలి. అధికార పార్టీల కనుసన్నలలో పనిచేసే వారు, సమస్యలపై ప్రభుత్వాన్ని ప్రశ్నించలేరనే అంశాన్ని గుర్తించాలి. ఇది ఇప్పటికే అనుభవం లోకి వచ్చిన అంశం. ఏ ప్రభుత్వం అధికారంలో ఉన్నా ఉపాధ్యాయ, ఉద్యోగ సమస్యలపై గళ మెత్తుతూ వారితో మమేకమయ్యే అభ్యర్థులే నిస్వార్ధంగా, నిజాయితీగా పనిచేయగలరు. ఆ కోవలోని వారే బొడ్డు నాగేశ్వరరావు, షేక్ సాబ్జీ. బొడ్డు నాగేశ్వరరావు గతంలో ఎమ్మెల్సీగా పనిచేసిన సందర్భంగా దానిని నిరూపించుకున్నారు. షేక్ సాబ్జీ సైతం ఉద్యమనేత ఉపాధ్యాయుల పక్షాన నిరంతరం పోరాటం చేస్తున్నారు. ఇటువంటి ఉద్యమ అభ్యర్థులను శాసన మండలికి పంపటం ద్వారా విద్యారంగ వికాసానికి, ప్రభుత్వ విద్య పరిరక్షణకు ఉపాధ్యాయ, అధ్యాపకుల సంక్షేమానికి కృషి చేస్తున్న పిడిఎఫ్‌ను బలోపేతం చేద్దాం.

PRINTED AND PUBLISHED BY POKKIREDDI BABU REDDY, ON BEHALF OF A. P.UNITED TEACHERS FEDERATION, PRINTED AT PRAJASAKTI PRINTERS&PUBLISHERS PVT LTD, D.NO.27-30-4, AKULAVARI STREET, GOVERNERPET, VIJAYAWADA- 520002, KRISHNA DISTRICT, ANDHRA PRADESH, PUBLISHED AT A. P.UNITED TEACHERS FEDERATION, 27-31-11, PALAPARTHIVARI VEEDHI, GOVERNERPET, VIJAYAWADA.520002, KRISHNA DISTRICT, ANDHRA PRADESH. EDITOR : T.S.L.N.MALLESWRA RAO.



# జాతీయం అంతర్జాతీయం

## నెమ్మదిగా ప్రపంచ దేశాలకు కొత్త స్ట్రెయిన్ ఇప్పటికే ఆందోళనలో 30 దేశాలు..

బ్రిటన్ లో వెలుగు చూసిన కొత్త రకం కరోనా వైరస్.. నెమ్మదిగా ప్రపంచ దేశాలలో అడుగుపెడుతోంది. ఈ కొత్త రకం స్ట్రెయిన్ ఇప్పటికే 30 దేశాలలో ప్రవేశించి ఆ దేశాలను ఆందోళనకు గురిచేసింది. కరోనా వైరస్ కంటే ఈ కొత్త రకం స్ట్రెయిన్ మరింత వేగంగా విస్తరిస్తున్నట్టు నిపుణులు చెబుతున్నారు. ఈ స్ట్రెయిన్‌తో అప్రమత్తమైన పలు దేశాలు.. వైరస్ వ్యాపిస్తోన్న ప్రాంతాల్లో కట్టుదిట్టమైన లాక్‌డౌన్ ను అమలుచేస్తున్నాయి.

## బ్రెగ్జిట్‌కు ఓకే.. ఇయు నుండి ఔట్.. సంతకం చేసిన బోరిస్ జాన్సన్

క్రిస్మస్ సందర్భంగా యూరోపియన్ యూనియన్‌తో ఒప్పందం కుదుర్చుకున్న బ్రెగ్జిట్ వాణిజ్య ఒప్పందానికి బ్రిటన్ పార్లమెంట్ ఆమోదం తెలిపింది. దీంతో యూరోపియన్ యూనియన్ నుండి బ్రిటన్ అధికారికంగా విడిపోనుంది. దీనికి సంబంధించిన వాణిజ్య ఒప్పందంపై బ్రిటన్ ప్రధాని బోరిస్ జాన్సన్ సంతకం చేశారు. జనవరి ఒకటి నుంచి కొత్త ఒప్పందం అమల్లోకి వచ్చింది.హౌస్ ఆఫ్ కామర్స్‌లో బిల్లుకు అనుకూలంగా 521 మంది ఎంపీలు, వ్యతిరేకంగా 73 మంది ఓటు వేశారు. బ్రెగ్జిట్‌పై ప్రజాభిప్రాయ సేకరణ జరిగిన నాలుగు సంవత్సరాల తర్వాత యూకే సంబంధాలను తెంచుకుంది.

## ఫైజర్ టీకా వినియోగానికి డబ్ల్యూహెచ్‌వో అనుమతి

కొవిడ్ నిరోధానికి ఫైజర్-బయోఎన్‌టెక్ రూపొందించిన వ్యాక్సిన్ అత్యవసర వినియోగానికి ప్రపంచ ఆరోగ్య సంస్థ (డబ్ల్యూహెచ్‌వో) అంగీకరించింది. దీంతో ప్రపంచవ్యాప్తంగా పలు దేశాలు ఈ టీకా దిగుమతి, పంపిణీకి మార్గం సుగమమైంది. అదేవిధంగా పలు పేద దేశాలు త్వరలోనే ఈ వ్యాక్సిన్ ను అందిపుచ్చుకునేందుకు వీలు కలిగింది. యుఎస్-జర్మన్ వ్యాక్సిన్‌తో డిసెంబర్ 8 న బ్రిటన్ తన టీకాల డ్రైవ్‌ను ప్రారంభించింది.

## రైతుల ఆందోళనలపై భారత్‌తో మాట్లాడండి అమెరికన్ కాంగ్రెస్ సభ్యుల లేఖ

భారత్‌లో కొనసాగుతున్న రైతుల ఆందోళనలపై ఏడుగురు అమెరికన్ కాంగ్రెస్ సభ్యులు విదేశాంగ మంత్రి మైక్ పాంపియోకు ఒక లేఖ రాశారు. రైతులు సాగిస్తున్న నిరసనల పట్ల తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. ఈ విషయమై భారత విదేశాంగ మంత్రి ఎస్.జైశంకర్‌తో మాట్లాడాల్సిందిగా వారు ఆ లేఖలో కోరారు. ఇందులో ఆరుగురు డెమోక్రాట్లు కాగా, ఒకరు రిపబ్లికన్ సభ్యుడు. నెల రోజులుగా సాగుతున్న ఢిల్లీ చలో ఆందోళనలను ప్రస్తావిస్తూ వారు డిసెంబరు 23న లేఖ రాశారు. ప్రస్తుతమున్న చట్టాలకు అనుగుణంగా జాతీయ విధానాన్ని నిర్ణయించుకునే భారత ప్రభుత్వ హక్కును తాము గౌరవిస్తామని చెప్పారు. తమ ఆర్థిక భద్రతకు ముప్పుగా పరిణమించిన ఈ వ్యవసాయ చట్టాలకు వ్యతిరేకంగా శాంతియుతంగా నిరసన తెలియచేసే వారి హక్కును కూడా తాము గౌరవిస్తామని అన్నారు.

## కొవిషీల్డ్, కొవాగ్జిన్‌లకు అనుమతి డిసిజిఐ ప్రకటన



ఎస్.పి.మనోహర్ కుమార్
ప్రధానకార్యదర్శి,కృష్ణా జిల్లా

కరోనా నివారణలో భాగంగా అత్యవసర వినియోగం కోసం కొవిషీల్డ్, కొవాగ్జిన్ వ్యాక్సిన్‌లకు దేశంలో అనుమతి లభించింది. భారత ఔషధ నియంత్రణ సంస్థ (డిసిజిఐ) ఈ మేరకు ప్రకటించింది. 'షరతులతో కూడిన అత్యవసర వినియోగం' కోసం అనుమతిస్తున్నట్లు డిజిసిఐ పేర్కొంది. ఆక్స్‌ఫర్డ్-ఆస్ట్రాజెనెకా సౌజన్యంతో సీరం ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇండియా కొవిషీల్డ్ వ్యాక్సిన్‌ను, ఐసిఎంఆర్ పుణె ఎన్ఐవి సహకారంతో భారత్ బయోటెక్ కొవాగ్జిన్ వ్యాక్సిన్‌ను తయారు చేసిన సంగతి తెలిసిందే. వీటిలో కొవిషీల్డ్ 70.42 శాతం సమర్థత కలిగిఉందని డ్రగ్స్ కంట్రోలర్ జనరల్ ఆఫ్ ఇండియా విజి సోమాని తెలిపారు.

## జనవరి 26న 'కిసాన్ పెరేడ్'...: రైతుసంఘాల పిలుపు

కేంద్రం ఏకపక్షంగా తీసుకువచ్చిన నల్ల వ్యవసాయ చట్టాలను రద్దు చేయాలని కోరుతూ...అలుపెరుగని యోధుల్లా ఢిల్లీ నడిఒడ్డున అన్నదాతలు ఆందోళనలను కొనసాగిస్తున్నారు. అందులో భాగంగా జనవరి 26 గణతంత్ర దినోత్సవం సందర్భంగా దేశ రాజధానిలో ట్రాక్టర్లతో కిసాన్ పరేడ్‌కు పిలుపునిచ్చారు. ఆ రోజు ట్రాక్టర్లపై జాతీయ జెండాలను ఉంచి ఢిల్లీ వైపుగా ర్యాలీ నిర్వహిస్తామని రైతు సంఘాల నేతలు తెలిపారు.

## వ్యవసాయ చట్టాలను ఉపసంహరించుకోవాలంటూ కేరళ అసెంబ్లీలో తీర్మానం

కేంద్రం ప్రవేశపెట్టిన మూడు వ్యవసాయ చట్టాలను వెంటనే ఉపసంహరించుకోవాలని కోరుతూ.. కేరళ అసెంబ్లీ ఏకగ్రీవ తీర్మానాన్ని ఆమోదించింది. కరోనా సంక్షోభ సమయంలో.. వ్యవసాయ రంగంలో గందరగోళం సృష్టించడంతో పాటు భయాన్ని పెంచిన ఇటువంటి పరిస్థితిని ప్రజలు భరించలేకపోతున్నారని ప్రభుత్వం పేర్కొంది. వ్యవసాయ ఉత్పత్తులను కేంద్రమే సేకరించి, నాణ్యమైన ధరలకు పంపిణీ చేసే వ్యవస్థ ఉండాలని అసెంబ్లీలో తీర్మానం ప్రవేశపెడుతూ... రాష్ట్ర ముఖ్యమంత్రి విజయన్ అన్నారు. రైతుల చారిత్రాత్మక నిరసనను పరిశీలించి వ్యవసాయ చట్టాలను రద్దు చేయాలనే రైతుల డిమాండును అంగీకరించాలని కేరళ అసెంబ్లీ అభ్యర్థిస్తోందని విజయన్ అన్నారు.

## తిరువనంతపురం మేయర్‌గా ఆర్య రాజేంద్రన్

తిరువనంతపురం మేయర్‌గా ఆర్య రాజేంద్రన్ బాధ్యతలు చేపట్టారు. దీంతో దేశంలో మేయర్ బాధ్యతలు చేపట్టిన పిన్న వయస్కురాలిగా ఆమె రికార్డులకెక్కారు. ఇటీవల కేరళలో జరిగిన స్థానిక ఎన్నికల్లో సిపిఎం తరపున ముడవాముంగళ్ వార్డు నుండి ఆమె పోటీచేసి యుడిఎఫ్ అభ్యర్థిపై 2,872 ఓట్ల మెజార్టీతో గెలుపొందారు. 21ఏళ్ల ఆర్య ప్రస్తుతం బిఎస్‌సి మ్యాథ్స్ రెండో సంవత్సరం చదువుతున్నారు. ఆర్య ప్రస్తుతం ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కమిటీలో సభ్యురాలిగా ఉండడంతో పాటు, కేరళ బాలల సంఘం అధ్యక్షురాలిగా ఉన్నారు. స్థానికంగా సిపిఎం కమిటీలో సభ్యులు. మహిళల సమస్యలు, అభివృద్ధి కార్యక్రమాలపై ప్రధానంగా దృష్టిసారిస్తానని పేర్కొన్నారు.

# ఆ కలం ఆ గళం ఎప్పటికీ చైతన్య దీపికే



ఎన్.వెంకటేశ్వర్లు
యుటియఫ్ రాష్ట్ర సహాధ్యక్షులు

ఎక్కడో ఒక మారుమూల పల్లెటూరు, ప్రస్తుతం మండల కేంద్రం అమర్తలూరు, గుంటూరు జిల్లా లో పుట్టి విద్యార్థి, యువజన, రైతు శ్రామికుడు, ఉద్యోగి, ఉపాధ్యాయుడు ఒక్కరేమిటి ఎవరి కష్టమైనా తీర్చే బాటలు నిర్మించే చైతన్యాన్ని కలిగించడానికి, తన కలాన్ని గళంగా మార్చి ఉవ్వెత్తున లేచిన తరంగం మైనేని. 1990 ఆ తరంగం కనుమరుగైనా, ఆ తరంగం స్ఫూర్తి... వేసిన బాట.... మెదళ్లకదలిక ...నూతన ఉత్తేజంతో నేటికీ కొన్ని వందల మంది సాహిత్య వారసుల రూపంలో "ఐక్య ఉపాధ్యాయ" రూపంలో ముందుకు సాగుతూనే ఉంది. దీన్ని గమనించి, పరిశీలించి, పరిశోధించి అందరిసౌఖ్యం కోసం కలాలను, గళాలను పదును పెడదాం. చైతన్య గీతికలను రచిద్దాం. అలపిద్దాం. మైనేని వారసులుగా నిలబడదాం.

**ఉపాధ్యాయుడికే సాధ్యం**

ఉపాధ్యాయుడు అంటే బడిలో పాఠాలు కే పరిమితం కాదు. అవసరమైతే సమాజంలో ఉన్న ప్రజలందరికీ చైతన్యాన్ని అందించే పాఠాలు బోధించాలి. అవకాశం వస్తే, అవసర మనిపిస్తే పాలకులకు గుణపాఠం చెప్పడానికి సన్నద్ధం కావాలని, తన కలం ద్వారా ఉపా ధ్యాయులలో ఉత్తేజం కలిగిం చారు. మన మైనేని మన చుట్టూనే ఉన్నారు. తను వదిలిన పని పూర్తి చేయడానికి కావలసిన సాహిత్య సైన్యాన్ని తయారు చేయటానికి, ఉపాధ్యాయ సమస్యల పరిష్కా రంలో చేస్తున్న పోరాటానికి అనుసంధా నంగా, అభ్యుదయ సాహితీప్రియులు భవిష్యత్తు తయారు చేయడం కూడా మన కర్తవ్యంగా తీసుకోవాలి.



మైనేని వెంకటరత్నం

**సమిష్టితత్వం**

మనచుట్టూ వున్న సంపద అందరి కష్ట ఫలితం. అందరూ సృష్టించిన సంపద అందరికీ సమానంగా పంపిణీ కావాలి. పోరాటం, చైతన్యం, భవిష్యత్తు తరాలు కులం, మతం లేని సమైక్య జీవన సౌందర్యానికి బాటలు వేసే నూతన తరాన్ని తయారు చేసుకోవాలి. ప్రపంచీకరణ సమిష్టితత్వాన్ని మెదుడు లోతుల్లో సమాధి చేసి నేను, నా కోసం, అనే భావాల మొలకల్ని గత 30 సంవత్సరాలు గా మొలిపిస్తూ, వాటిని విష వృక్షాల గా మార్చే కలాలు, గళాలు విజృంభిస్తున్నాయి. నీకోసం బ్రతకడమే జీవితానికి సార్థకత. అందరి సౌఖ్యం గురించి ఆలోచించడం తెలివితక్కువతనం. పో.. దూసుకు పో .. నీ కెరియర్ నీ ఇష్టం. ఈ ప్రపంచం ఏమైపోతే నీకెందుకు?. నీ చుట్టూ అందమైన ఇల్లు కట్టుకో. కృత్రిమ పూలు కాయలు సృష్టించి ఇదే ప్రకృతి, ఇదే స్వర్గం. దాని వెంట పరిగెత్తాలి ఆగితే అన్ని కోల్పోతామని, హెచ్చరిస్తూ గొంతులు కోసే పోటీ సృష్టిస్తూ, ఆ పోటీ చుట్టూ నిన్ను పరిగెత్తి స్తుంది. సాధించేదాకా లేకపోతే, చచ్చేదాకా.. మనం సమిష్టి తత్వం ఈ సమాజం అభివృద్ధి కి శోదక శక్తి. దీనికి ఉద్యోగ ఉ పాధ్యాయులం దరికి అవసరమైతే ప్రజలకు నిర్మోహ మాటంగా చెప్పాలని బోధించిన అభ్యుదయవాది.

**అభ్యుదయ సాహిత్యం**

కవిత్వంతో రాళ్లను కరిగించే వారట. విప్లవాన్ని సృష్టించే వారట. చైతన్యాన్ని రగిలించి కాళ్లు మొక్కుతా అన్న వారి చేత బంధుకులు పట్టించిన సాహిత్యం, ఎన్నో వేల కిలోమీటర్లు ప్రయాణం చేసి తను అను కున్నది సాధించడానికి ఎంతటి కష్టాన్నైనా ఇష్టంగా మార్చుకున్న **'చే డైరీ'.** అమ్మ నవల ద్వారా చైతన్యంని సమాజానికి అందించిన వారు. పదండి ముందుకు ...పదండి తోసుకు పోదాం... పైపైకి అన్న శ్రీశ్రీ. అదే కోవలో మన మైనేని. ఇలా సమాజహితం కోరిన సాహితీ పోరాట యోధులెందరో.. కానీ నేడు బాధా కరమైన అంశం కవిత్వం ప్రశ్నించే స్థాయి నుండి(ఎక్కువ శాతం) నా కులం, నామతం గొప్పది అని చెప్పే పరిస్థితికి రూపాంతరం చెందింది పాలకులను పొగిడే కవిత్వం, అంతి మంగా పెయిడ్ కవిత్వం రాజ్యమేలుతుంది. ప్రశ్నించడాన్ని అడ్డుకుని హింసిస్తున్న కాలంలో మనం జీవిస్తున్నాం. అయ్యా ఈ కౌన్సిలింగ్ మాకు ఇబ్బందిగా ఉంది. మా విజ్ఞప్తిని పరిశీలించండి. పోరాడి సాధించిన కౌన్సిలింగ్ ఇవ్వండని అభ్యర్థిం చడమే నేరంగా చూస్తున్న కాలంలో మనం ఉన్నాం. పెళ్లిళ్లు కోసం లక్షలు లక్షలు పరువు పేరుతో అప్పు చేసి డస్ట్ బిన్‌లో ఆహారాన్ని పడవేస్తున్న రోజుల్లో మనం ఉన్నాం. పెళ్లి అనేది ఆర్థిక సంబంధం కాదు ఇరువురి మధ్య మానసిక సంబంధం. అది వికసించి అభ్యుదయ భావాలను సృష్టించే నూతన భూమిక. ఆదర్శ వివాహాలకు పెళ్లి పెద్దగా మారారు మైనేని. పదుల సంఖ్యలో వివాహాలు చేశారు. పోరాటం చైతన్యం రగిలించడమే కాదు, తను పనిచేస్తున్న ఉపాధ్యాయ రంగంలో ఉపాధ్యాయులకు వృత్తి నైపుణ్యం పెంచడానికి కావాల్సిన

# ఉపాధ్యాయుల బదిలీల అంశంలో ముఖ్యమంత్రి జోక్యం చేసుకోవాలి

## నిరాహారదీక్షలో ఎమ్మెల్సీలు

ఉపాధ్యాయుల బదిలీలలో అధికారుల వైఖరికి నిరసనగా ఫ్యాప్టో ఆధ్వర్యంలో పలు నిరసన కార్యక్రమాలు జరిగినా వారి వైఖరిలో ఎలాంటి మార్పులేకపోవడంతో ఈ అంశంలో ముఖ్యమంత్రి జోక్యం చేసుకోవాలని పిడిఎఫ్ మరియు స్వతంత్ర ఎమ్మెల్సీలు డిసెంబర్ 24న విజయవాడ ధర్నా చౌక్‌వద్ద నిరాహారదీక్ష చేపట్టారు.

పిడియఫ్ ఎమ్మెల్సీలు వి.బాలసుబ్రహ్మణ్యం, కె.యస్. లక్ష్మణ రావు, రాము సూర్యారావు, ఐ.వెంకటేశ్వరరావు, స్వతంత్ర ఎమ్మెల్సీలు కత్తి నరసింహారెడ్డి, పి.రఘువర్మలు దీక్ష చేపట్టారు. మరో పిడిఎఫ్ ఎమ్మెల్సీ యండపల్లి శ్రీనివాసులురెడ్డి తిరుపతిలోని తన నివాసంలో దీక్షలో పాల్గొన్నారు.

ఫ్యాప్టో కో–చైర్మన్, యుటియఫ్ రాష్ట్ర అధ్యక్షులు షేక్ సాబ్జీ అధ్యక్ష వహించారు. మాజీ శాసనమండలి సభ్యులు, ప్రజావక్తి సంపాదకులు ఎంవిఎస్ శర్మ మాట్లాడుతూ బదిలీల విషయంలో రాష్ట్ర ప్రభుత్వం మొండిగా వ్యవహరిస్తోందన్నారు. ఈ సమస్యను పరిష్కారం కోసం ముఖ్యమంత్రి జోక్యం చేసుకోవాలని అన్నారు. పిడిఎఫ్ ఫ్లోర్ లీడర్ వి.బాలసుబ్రహ్మణ్యం మాట్లాడుతూ ఉపాధ్యాయ సంఘాలపై అధికారుల తప్పుడు ప్రచారాన్ని మానుకోవాలని, ముఖ్యమంత్రి వెంటనే జోక్యం చేసుకొని సమస్య పరిష్కరించాలన్నారు. ఉపాధ్యాయులు చేసే పోరాటాలకి పిడిఎఫ్ సంపూర్ణ మద్దతుగా నిలుస్తుందన్నారు.

ఈ శిబిరంలో మాజీ శాసన మండలి సభ్యులు బొడ్డు నాగేశ్వర రావు, ఫ్యాప్టో సెక్రటరీ జనరల్ నరహరి, యుటియఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పి.బాబురెడ్డి, ఫ్యాప్టో కో–చైర్మన్లు ఎం.రఘునాథరెడ్డి, కె. వెంకటేశ్వరరావు, పి.పాండురంగవరప్రసాద్ తదితరులు ప్రసంగించారు.

ఈ కార్యక్రమంలో ఎన్.వెంకటేశ్వర్లు ఎస్.పి.మనోహర్‌కుమార్, శ్రీనివాసరావు, డివైఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి ఎం.సుబ్బారావు తదితరులు మాట్లాడారు.

శిక్షణా మెటీరియల్ను, స్వయంగా తను తయారుచేయటం, అలాగే తయారు చేసే వారిని గుర్తించి వారితో తయారు చేయించడం, ఉపాధ్యాయులకు శిక్షణ ఇచ్చిన ముందు చూపు గల మనిషి మైనేని. నేడు ఎకడమిక్ సెల్ ఆధ్వర్యంలో యుటిఎఫ్ మైనేని వారసత్వాన్ని కొనసాగిస్తుంది. ఇది మరీ అంత ప్రణాళికాబద్ధంగా చేయడానికి ప్రయత్నం చేద్దాం.

**ఐక్య ఉపాధ్యాయ పత్రిక**

పత్రిక నడపటం, పత్రికల్లో శీర్షికలు డిజైన్ చేయడం, పాఠకులను ఆకర్షించడం, విషయాలను వ్రాసే వ్యాసకర్తలను గుర్తించడం ఎంత కష్టమో మనకు తెలుసు. ఇలాంటి కష్టాన్ని అధిగమించి ఐక్య ఉపాధ్యాయ పత్రికలో గుస గుసలు, మీరు చదివారా, మన ఆరోగ్యం, విద్యా విషయాలు శీర్షికలు నిర్వహించారు మైనేని. పాఠకులకు ఆసక్తిని పెంపొందించడానికి కృషి చేశారు. అలాగే ఈ పత్రికను చదివే దానికోసం ఇది మన కార్యకర్తలకు ఉపయోగపడే దానికోసం నిరంతరం మార్పులు చేర్పులు క్రింది స్థాయి వరకు కార్యకర్తల అభిప్రాయం అడిగి మార్పులు చేసే దానికోసం ప్రయత్నం చేశారు. ఐక్య ఉపాధ్యాయ పత్రిక ఎక్కువమంది లోకి తీసుకు వెళ్లడానికి మైనేనితన జీవితాన్ని ఉపయోగించారు అనడం అతిశయోక్తి కాదు. అలాగే నేడు మనపత్రికలో వస్తున్న విద్యావిషయక అంశాలు, సామాజిక ఆర్థిక రాజకీయ కోణంలో వస్తున్న వ్యాసాలు ఎంత మందిమి చదువు తున్నామో ఆత్మ పరిశీలన చేసుకోవాలి. కులం చుట్టూ, మతం చుట్టూ రాజకీయాలు చేస్తూ బువ్వ పెట్టే రైతులను పట్టించుకోని రాజకీయ పార్టీల వైఖరిని ఉపాధ్యాయులకు ప్రజలకు చెప్పేందుకు కలాలు గళాలు కావాలి. ఈ పత్రిక పెంపుదలలో ప్రతి సభ్యుడు కృషి చేయాలి. ప్రతి ఉపాధ్యాయుడు మన పత్రికని చదివే విధంగా ప్రోత్సహించాలి.

**మైనేని ఆదర్శం**

మైనేని జీవితాన్ని అధ్యయనం చేయడం, మైనేని ఆచరించిన విషయాలు పరిశీలించటం, చుట్టూ వివిధ రంగాలలో జరుగుతున్న మార్పుల్ని, పోరాటాలను అధ్యయనం చేసి మన ఉపాధ్యాయ రంగానికి ఎలా అనువర్తింప చేయాలో నేర్చుకోవడం. సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేయాలి. మెదడు లోతుల్లో దాచిన సమిష్టి తత్వాన్ని తవ్వి తీయడానికి పైపైన పొరల్లో ఉన్న విషవృక్షాలను కూకటివేళ్లతో పెకలించే కలాలుగా మనం మారాలి .కొన్ని వందల మైనేనిలాంటి వారు నేడు సమాజానికి అవసరం. అది మన ఉపాధ్యాయులకు సాధ్యం..ప్రయత్నించి చూద్దాం.

### సకాలంలో వార్తలు పంపండి

**"ఐక్యఉపాధ్యాయ"కు** పంపే వార్తలు, ఫోటోలు ప్రతినెల 30,31 తేదీలలోపు పంపగలరు. ఆ తదుపరి వచ్చినవి ప్రచురణకు తీసుకొనుట సాధ్యపడదు.

**– సంపాదకవర్గం, ఐక్యఉపాధ్యాయ**

# ఆధునిక విద్య ద్వారానే స్త్రీ విముక్తి సాధ్యం



ఆధునిక విద్య ద్వారానే స్త్రీ విముక్తి సాధ్యపడుతుందని నమ్మిన సావిత్రిబాయి పూలే 1831 జనవరి 3న జన్మించారు 1848 జనవరి 1న పూనా లో మొట్టమొదటి బాలికా పాఠశాలను ప్రారంభించారు. ఆమె దేశంలోనే మొదటి మహిళా ఉపాధ్యాయురాలు. పీడిత ప్రజలు మరీ ముఖ్యంగా స్త్రీల విద్యాభివృద్ధికి కృషిచేసిన తొలి ఉద్యమకారిణి. చదువు, ఆస్తి కలిగి ఉండడం వంటి సమస్త హక్కులను నిరాకరించిన సనాతనవాద సంప్రదాయాలను, ఆనాటి అసమాన సమాజపు కట్టుబాట్లను, ఆదిపత్య వర్గాల దోపిడీని దిక్కరించి చరిత్రలో ఆమె మార్గదర్శకులయ్యారు. 1848లో ని బహుజనులకు సైతం వారు పాఠశాలను ప్రారంభించారు. నిచ్చెన మెట్ల కుల వ్యవస్థను ధిక్కరించారు. బాల్య వివాహాలకు, మూఢనమ్మకాలకు, సతీ సహగమనానికి వ్యతిరేకంగా వితంతు పునర్వివాహల కోసం బలమైన ఉద్యమ నిర్మాణంలో ముఖ్య భాగస్వాములుగా పని చేశారు. భర్త చనిపోయి నప్పుడు చితికి నిప్పు పెట్టి కొత్త సంప్రదాయానికి శ్రీకారం చుట్టారు . ప్లేగు వ్యాధిగ్రస్తులకు మరీ ముఖ్యంగా దళిత బిడ్డలకు సేవ చేస్తూ మరణించారు. వారి జయంతి ని దేశమంతా అధికార పక్షాలతో సహా ఘనంగా నిర్వహిస్తున్నారు.

చిత్తశుద్ధిలేని శివపూజలేల అంటారు పెద్దలు. నేటి పాలకులకు ఈ నానుడి చక్కగా సరిపోతుంది. 170 సంవత్సరాల క్రితం సావిత్రిబాయి పూలే మరియు ఆమెలాంటి మరెందరో సంఘ సంస్కర్తలు చేసిన కృషి నాశనం చేసేందుకు కాలం చెల్లిన సామాజిక దోపిడి స్థితిని తిరిగి నెలకొల్పేందుకు నూతన విద్యా విధానాన్ని కేంద్రం సాధనంగా చేసుకుంది.

సామాజిక మార్పు లో విద్య కీలక మైనది. వివిధ విద్యా కమిషన్లు, 1986లో ప్రకటించిన విద్యా విధానం ఈ లక్ష్యాలను బహిరంగంగా ప్రకటించాయి. కానీ ఆర్ ఎస్ ఎస్ కనుసన్నలలో పాలిస్తున్న బిజెపి ఈ లక్ష్యాలను వమ్ము చేస్తూ రాజ్యాంగానికి విరుద్ధంగా నూతన విద్యా విధానాన్ని తీసుకొచ్చింది. మనువాద భారత సమాజం మహిళలకు, శూద్ర కులాలకు విద్యను నిరాకరించింది. ఇప్పుడు ఈ విధానం అమల్లోకి వస్తే దళితులు, ఆదివాసీలు మైనారిటీలు, మహిళలు, పేదలు విద్యావకా శాలకు దూరం చేయబడతారు. ఈ విధానంలో బాలికల విద్య గురించి చర్చించలేదు. వివక్షత గురించి కానీ, సమాన అవకాశాల గురించి కానీ ఇందులో లేదు. 15 -18 సంవత్సరాల మధ్యలో 40 శాతం అమ్మాయిలు స్కూలు మానేస్తున్నారు. వారికి విద్యావకాశాలను మెరుగుపరచడం గురించి మాట్లాడకపో గా పిల్లలు తక్కువగా ఉన్నా స్కూళ్లను మూసివేయడానికి ఆమోదించారు. అందుబాటులో పాఠశాలలు, కళాశాలలు ఉంటేనే ఆడపిల్లలు చదువుకోగలరు. వివిధ రాష్ట్రాల్లో 2017లో 1,47, 494 స్కూళ్ళు మూసివేయబడ్డాయి.



**రమా దేవి**
రాష్ట్ర కార్యదర్శి - ఐద్వా

పబ్లిక్ ప్రైవేట్ భాగస్వామ్యాన్ని పెంచడం అంటే ప్రభుత్వ పాఠశాలలను, కళాశాలలను నిరుత్సాహపరుచడమే. మన రాష్ట్రంలో కూడా ఎయిడెడ్ స్కూల్స్ ,కళాశాలలను ప్రభుత్వానికి అప్ప చెప్పండి లేదా మీరు నడుపు కోండి అనడం ప్రైవేటీకరణకు దారి తీస్తుంది. ఫలితంగా ఒక తరం యావత్తు విద్యావకాశాలను కోల్పోను న్నారు విద్య ఖరీదు పెరిగేకొద్ది బాలికలు విద్యకు నోచుకోలేరు. బాల్య వివాహాలు పెరుగుతాయి.

**ఆన్‌లైన్ విద్యకు ప్రోత్సాహం, ప్రైవేటీకరణ**

మహిళల దళితుల విద్యకు ఆటంకం కానున్నాయి .అర్బన్ ప్రాంతా లతో పోలిస్తే గ్రామీణ ప్రాంతాల్లో ఇంటర్నెట్టు, కంప్యూటరు కలిగి ఉన్న వాళ్ళ సంఖ్య తక్కువ. పై వర్గాలు వర్ణాలతో పోల్చి చూసినప్పుడు దిగువ వర్గాలు వర్ణాలు కూడా ఇంటర్నెట్, కంప్యూటర్ సదుపాయాలు నామమాత్రంగానే ఉన్నాయి. ఆన్‌లైన్ విద్య అంటే విద్యావకాశాలు కోల్పోవడమే.

ఓపెన్ స్కూలు, దూర విద్యను ప్రోత్సహించనున్నారు. ఫలితంగా నాణ్యమైన విద్యను పొందలేరు. అంతేకాక కుటుంబ శ్రమను మోయాల్సి వస్తుంది. ఇంటి పని భారం బాలికలదే అవుతుంది. కాలంచెల్లిన పురుషాధిపత్యా నికి పెద్దపీట వేయబడుతుంది. తద్వారా మహిళల శ్రమను కారుచౌకగా పొందే పరిస్థితి వస్తుంది.

అన్ని వేదాల్లోనే ఉన్నాయంటూ ఆధునిక శాస్త్ర విజ్ఞానాన్ని, మానవ ఔన్నత్యాన్ని తృణీకరించే ధోరణు లకు భారతీయ సంస్కృతి పేరిట ఈ విద్యా విధానం బలం చేకూరుస్తుంది. సమానత్వాన్ని ఆటంకపరిచే ఆచారాలు, సంప్రదాయాలను సంస్కృతి పేరిట ఎత్తుకున్నది. వేద శాస్త్రాల పేరిట, సంస్కృతం నేర్పే పేరిట మహిళా వ్యతిరేక దళిత, శూద్ర వ్యతిరేక భావజాలాన్ని చిన్న వయస్సు నుండే నేర్పించ బోతున్నారు.

భారతీయ సంస్కృతిలో భాగంగా ఉన్న సంస్కారాన్ని నేర్చుకో మంటున్నారు. స్త్రీలను శూద్రులను సేవకులుగా చూసే భారతీయ సంస్కృతిని నేడు ఆర్ఎస్ఎస్ బిజెపి నాయకులు పదే పదే చెప్పడం మనం వింటున్నాము .ఆర్ఎస్ఎస్ నేత మోహన్ భగవత్ వివాహ ఒప్పందం ప్రకారం స్త్రీలు ఇంటి బాధ్యతలు నిర్వహించాలని, భర్త బిడ్డలను జాగ్రత్తగా చూసుకోవాలని అది భారతీయ ధర్మం అని అంటున్నారు. మాతృత్వ బాధ్యతలు, సాంప్రదాయ రక్షణలను, మత క్రతువులను సంస్కృతిగా చాటుతున్నారు.

అహింసావాదిగా ఉన్న గాంధీజీ బొమ్మను తుపాకీతో కాల్చిన ప్రజ్ఞాసింగ్ శూద్రులు తమ కుల ధర్మాలను చెప్పుకోవాలి అంటున్నారు.

ఆ రకంగా దుస్సాంప్రదాయాలను ఎదుర్కొని పేడ నీళ్లు చల్లినా, దాడులు చేసినా వెరవక సావిత్రిబాయి పూలే కృషి చేశారు. అలాంటి కృషిని వమ్ము చేసే అనేక విధానాలు ఈ విద్యావిధానంలో చోటు చేసుకున్నాయి..

సావిత్రిబాయి లాంటి వారి కృషి, స్వాతంత్రోద్యమం, సోషలిస్ట్ భావజాలం ఫలితంగా అట్టడుగున ఉన్న మహిళలు, దళితులకు, పేదలకు ప్రత్యేక సదుపాయాలు కల్పించాలని, సామాజిక న్యాయం లక్ష్యంగా ప్రభుత్వం పని చేయాలని రాజ్యాంగాన్ని రూపొందించుకు న్నాము. ఈ విద్యా విధానంలో పొందుపరిచిన అంశాలు రాజ్యాంగ ఆదేశాన్ని నిరాకరిస్తున్నాయి. సావిత్రిబాయి పూలేకి నివాళి ఇవ్వడం అంటే ఆధునిక పాలకులు తీసుకురానున్న కాలం చెల్లిన మనువాద భావజాలంప్రాతిపదికగా తేనున్న విద్యావిధానాన్ని, అసమాన సామాజిక నీతిని ప్రశ్నించాలి. ప్రతిఘటించాలి. ఆమె బాటలో పయనించేందుకు దీక్షపూనాలి.

## ఐక్యఉపాధ్యాయ కథలు, కవితల పోటీలలో ప్రచురణకు ఎంపికైన కవితలు

# రచయిత

- గుడిపాడు రమణారావు,
రాయదుర్గం, అనంతపురం

రైతుల వ్యదార్థ జీవితాన్ని అక్షరాల్లో పొదిగితే
పాఠకుల కళ్ళ కన్నీటి కుండలవుతాయి
అతను మాత్రం రైతుల దగ్గర పంటను కొనడు
బహుళజాతి అంగళ్ళలో అతికించిన రేటుకే కొంటాడు
చేనేత కార్మికుల చితికిన బతుకు చిత్రాన్ని
'నభూతో' అన్న చందంగా వర్ణిస్తాడు
చేనేతల స్వేదానికి సాక్షిగా నిలిచిన పంచె, చీర, దోమతెర....
ఏ ఒక్కటీ కొనడు - కొనమని ఇతరులకు చెప్పడు
అన్నీ 'గాల్లోనే' తెప్పించుకుంటాడు.
స్త్రీ సమస్యల తీవ్రతను వర్ణించిన తీరును
భూమాత చదివితే
నిలువునా చీలి స్త్రీ జాతినంతటినీ తనలో
ఇముడ్చుకుంటుందేమోననిపిస్తుంది
అర్ధాంగని పేరుతో పిలిచిన క్షణం
కూతురును కుమారునితో పాటు సమానంగా చూచిన సందర్భం
మచ్చుకు ఒక్కటీ కానరావు.
కార్మికుల కడగండ్లను ఇంతకంటే ఎక్కరూ
కళ్ళకు కట్టలేరన్నట్టు రాసేస్తాడు
గంటలు గంటలు ఉపన్యసిస్తాడు
గంపల్లో పండ్లు అమ్ముకునే నిరుపేదలతో
తోపుడు బండ్ల మీద కూరగాయలు అమ్ముకునే చిరుజీవుల దగ్గరా
రూపాయి ఎక్కువిస్తే ప్రాణమే పోతుందా! అన్నట్లు బేరం ఆడతాడు
సమాజంలోని సమస్యలను చిలువలు - పలువలుగా
ఏకరువు పెడతాడు
ఒక్క సమస్యకూ పరిష్కారం చెప్పడు
జనం సమస్యలు - కష్టాలు అతనికి కావాలి
అవి అతనికి అవార్డులు - రివార్డులు తెచ్చి పెట్టాలి
ఎంతైనా అతను 'బ్రతకనేర్చిన రచయిత'

# కార్పొరేట్ తాజా సరుకు

- జి. ఉషారాణి,
గూడూరు, నెల్లూరు జిల్లా

నేను పుట్టక ముందే
భవిష్య కాలనిర్ణయ పట్టిక
సిద్ధమైపోయింది......
నేను కాళ్ళు చేతులున్న మొండి
పలకనుజి
అక్షరాలు దిద్ది అరిగిన మొద్దు బలపాన్ని......
సిలబస్ భారానికి
నన్ను శిలువ వేసుకుని
ఈ కలల పోరుకు
దించిన అమ్మనాన్నల
ఆశలు పండించ లేని
ఖాళీ కాగితాన్ని....
దుఃఖ ఋతువులను
మోస్తున్న చిన్నారి ని.....
కోల్డ్ స్టోరేజి ల్లాంటి
చీకటి ని మింగేసిన గదుల్లో
ర్యాగింగ్ రక్కసి కోరల్లో
బితుకు బితుకు మంటూ
క్షణాలు లెక్క పెడుతున్న శరణార్థిని.....
అర్థం లేని
అర్థం కాని చదువుల( బట్టి)కాక కి
ఉడికిపోయిన గుండె గుబులును
చెప్పుకోను చేతకాని చిరుప్రాయాన్ని....
ర్యాంకుల రేసులో
ఓడిపోయి కార్పొరేట్
విపణి వీధి లో
తాజాసరుకులా అమ్ముడు పోయి
ఆశలను ఉరిపోసుకుంటున్న
పాపాయిని....




కోవిడ్–19 మహమ్మారి పిల్లల విద్యాభ్యాసంలో అనివార్యంగా మోసుకొచ్చిన పెను మార్పులను, విద్యార్థులు, తల్లిదండ్రులపై పెంచిన ఆర్థిక, మానసిక, సామాజిక ఒత్తిడులను యాన్యువల్ ఎడ్యుకేషన్ స్టేటస్ రిపోర్టు (అసర్)–2020 వేవ్–1 కళ్లకు కట్టింది. కొన్నేళ్లుగా విద్యారంగంపై సర్వే చేస్తున్న 'ప్రథమ్' అనే స్వచ్ఛంద సంస్థ కరోనా కాలంలో విద్యారంగంపై పిడుగుపాటులా వచ్చి పడ్డ మార్పులపై దేశంలోని అన్ని రాష్ట్రాలూ, కేంద్ర పాలిత ప్రాంతాల్లో ఫోన్ సర్వే నిర్వహించగా వెల్లడైన దృష్టాంతాలు మిక్కిలి ఆందోళన కలిగిస్తున్నాయి. దేశంలోని 26 రాష్ట్రాలు 4 కేంద్రపాలిత ప్రాంతల్లోని 584 జిల్లాల్లో అసర్ వారు సర్వేని నిర్వహించారు. 16974 గ్రామాల్లో, 52,227 గృహాలను, 59251 మంది 5 నుంచి 16 సంవత్సరాల విద్యార్థులను, 8963 పాఠశాలల్లో సర్వే నిర్వహించ బడింది. ఈ సర్వేలో పాల్గొన్నవారు 1500 మందిగా ఉన్నారు.

దేశంలో విద్యావ్యవస్థ స్థితిగతులపై ఏటా స్వచ్ఛంద సంస్థ ప్రథమ్ విడుదల చేసే వార్షిక విద్యాస్థాయి నివేదిక (అసర్)లు దాదాపు నిరాశానిస్పృహలే మిగులుస్తాయి. నాలుగోతరగతి పిల్లలు ఒకటో తరగతి లెక్కలు కూడా చేయలేకపోతున్నారని... అయిదో తరగతి పిల్లలు మూడో తరగతి పుస్తకాన్ని కూడా తప్పులు లేకుండా చదవలేక పోతున్నారని అది గతంలో చాలాసార్లు చెప్పింది. మన దేశంలో పదేళ్లక్రితం ఆర్భాటంగా మొదలైన విద్యాహక్కు




చట్టం ఆచరణలో ఎంత ఘోరంగా విఫలమైందో చెప్పడానికి ఆ సర్వేలు సజీవ సాక్ష్యంగా నిలుస్తాయి. ఆ చట్టం వల్ల కేవలం విద్యార్థుల నమోదు పెరిగింది తప్ప, హాజరు శాతం అందుకు దీటుగా వుండటం లేదని ఆ నివేదికలు తరచు చెబుతుంటాయి. అయితే ఈసారి పరిస్థితి పూర్తిగా భిన్నమైన పరిస్థితుల్లో అసర్ నివేదిక విడుదలైంది. కరోనా వైరస్ మహమ్మారి విరుచుకుపడిన పర్యవసానంగా విధించిన లాక్‌డౌన్‌తో విద్యాసంస్థలన్నీ మూత బడ్డాయి. విద్యాసంస్థలు తెరవడానికి ప్రభుత్వాలు సాహసించడం లేదు. దానికి బదులు ఆన్‌లైన్ పాఠాలవైపు మొగ్గుచూపడం మొదలైంది. తాజా నివేదిక ఈ ఆన్‌లైన్ బోధన ఎలావుందన్న అంశంపై ప్రధానంగా దృష్టి సారించింది. అది తీసుకొచ్చిన కొత్తరకం అసమానత లేమిటన్నదీ వెల్లడించింది. ఇక పల్లెసీమల్లో ప్రైవేటు పాఠశాలలనుంచి ప్రభుత్వ పాఠశాలలవైపు వలసపోయే ధోరణి గత రెండేళ్ల మాదిరే ఈసారి కూడా పెరిగిందని ఆ నివేదిక చెబుతోంది. ఇందుకు కారణం ఆ పిల్లల తల్లిదండ్రుల ఆదాయాలు పడిపోవడం వల్లనేనని అసర్ నివేదిక అభిప్రాయం.

ఈసారి కొత్తగా అమల్లోకొచ్చిన ఆన్‌లైన్ విద్యావిధానానికి పిల్లలు అలవాటు పడ్డారని అసర్ నివేదిక చెబుతోంది. రెండేళ్లక్రితం పరిస్థితితో పోలిస్తే ఇప్పుడు పిల్లలున్న కుటుంబాల్లో స్మార్ట్ ఫోన్‌ల వాడకం బాగా పెరిగిందని వివరిస్తోంది. హాజరుపట్టీల్లో నమోదైన పిల్లల్లో 61.8 శాతమందికి స్మార్ట్‌ఫోన్‌లున్నాయని,రెండేళ్లక్రితం కేవలం 36.5 శాతం పిల్లల ఇళ్లలో మాత్రమే అవి వుండేవని నివేదిక వెల్లడించింది. లాక్‌డౌన్ అనంతర పరిస్థితుల్లో ఉపాధి కోల్పోయినా అదనంగా ఇంతమంది స్మార్ట్‌ఫోన్‌లు కొనడం కొంత ఆశ్చర్యం కలిగిస్తుంది. అయితే తమ పిల్లలు ఎలాగైనా చదువుల్లో ఉన్నతంగా వుండాలన్న లక్ష్యంతో అప్పో సప్పో చేసి ఆ ఫోన్‌లు కొనేవారు తప్పనిసరిగా వుంటారు. స్మార్ట్ ఫోన్ వున్నంతమాత్రాన అంతా సవ్యంగా వుందనుకోలేం. ఒకరే సంతానం వున్న ఇంట్లో ఫర్వా లేదుగానీ... ఒకరికి మించి పిల్లలున్నచోట సమస్యే. వేర్వేరు తరగతుల పిల్లలకు ఒకే సమయంలో బోధన సాగుతున్నప్పుడు తమ పిల్లల్లో ఆ ఫోన్ ఎవరికి ఇవ్వాలన్నది తల్లిదండ్రులు తేల్చుకోలేరు. ఇలాంటి సందర్భాల్లో చాలాసార్లు ఆడపిల్లలకే అన్యాయం జరుగుతుందని చెప్పనవసరం లేదు. అయితే ఆన్‌లైన్ విద్య వల్ల కుటుంబాల్లో పిల్లలపట్ల శ్రద్ధ కనబరిచే ధోరణి పెరిగిందని అసర్ నివేదిక అంటోంది. తల్లిదండ్రులు, తోడబుట్టినవారి సాయం పిల్లలకు అందుతోందని గణాంకాలు వెల్లడించాయి. తల్లిదండ్రులు అయిదో తరగతి వరకూ చదువుకున్నవారైతే తమ పిల్లలకు ఏదో రూపంలో తోడ్పాటు అందిస్తున్నారని నివేదిక తేల్చింది. 54.8 శాతమంది పిల్లలకు ఇలా సాయం అందుతోందని అది వివరించింది. తమకు తెలియని సందర్భాల్లో ఇరుగు పొరుగునో, టీచర్‌నో ఆశ్రయించి తమ పిల్లలకు మెరుగ్గా అర్థమయ్యేందుకు వారు తోడ్పడుతున్నారట. ఈసారి బడులు మూతబడ్డాయి కనుక ప్రథమ్ సంస్థ ఫోన్‌ల ద్వారానే తల్లిదండ్రుల్ని, ఉపాధ్యాయుల్ని ప్రశ్నలడిగి సమాచారం రాబట్టింది. నేరుగా వారితో మాటామంతీ జరిపితే మరింత లోతైన సమాచారం సేకరించినట్లు అసర్ రిపోర్టులో పేర్కొన్నారు. అతి సామాన్య కుటుంబాల్లో కూడా పిల్లల చదువులపై

నేరుగా తల్లిదండ్రులు శ్రద్ధ పెట్టే ధోరణి పెరగడం మంచిదే. ఇది ఆన్‌లైన్ విద్యావిధానం తీసుకొచ్చిన సుగుణం. అయితే బడివిద్యకు ఆన్‌లైన్ విద్య ఏమాత్రం ప్రత్యామ్నాయం కాదు. తరగతి గదిలో పిల్లలు కేవలం పుస్తకాల్లో వుండే జ్ఞానాన్ని మాత్రమే కాక, అనుభవజ్ఞానాన్ని కూడా సంపాదిస్తారు. పిల్లలకూ, టీచర్లకూ మధ్య... పిల్లలమధ్య జరిగే సంభాషణలు వారికి వికాసానికి తోడ్పడతాయి.

ఇక గణాంకాలకొస్తే ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకునే పిల్లల్లో మూడింట ఒక వంతు మందికే ఇంటర్నెట్ సౌకర్యం ఉంది. పదకొండు శాతం మందికే ఆన్‌లైన్ క్లాసులు అందుబాటులో ఉన్నాయి. కేవలం 24.3 శాతం మందికే లెర్నింగ్ మెటీరియల్ అందింది. లెర్నింగ్ మెటీరియల్ పొందాలంటే స్మార్ట్‌ఫోన్-వాట్సాప్ ఉండాలి. 75 శాతం స్కూళ్లకు వాట్సాప్ సదుపాయం లేదు. అసలు 43.6 శాతం మందికి స్మార్ట్‌ఫోన్‌లే లేవు. ఒక ఇంట్లో ఒకరి కంటే ఎక్కువ మంది పిల్లలు ఉంటే, తల్లిదండ్రులు రెండో ఫోన్ కొనలేక, ఇంటర్నెట్ రీఛార్జి చేసుకునే స్తోమత లేకపోతే, ఆడ పిల్లలకు కాకుండా మగ పిల్లలకు ఫోన్ ఇస్తున్నారు. లాక్‌డౌన్‌లో అడ్మిషన్లు లేక ఐదు శాతం మంది డ్రాపవుట్లుగా మారారు. ప్రైవేటు ఫీజులు భరించలేక ఈ కాలంలో ఐదు శాతానికి పైన పిల్లలు ప్రభుత్వ స్కూళ్లకు మారారు. గ్రామీణ, అందులోనూ మారుమూల ప్రాంతాలు నేటికీ ఇంటర్నెట్‌కు దూరంగా ఉన్నాయి. ఇలా చెప్పుకుంటూ పోతే అసర్ అధ్యయనం బహిర్గతపర్చిన అనేకానేక అంశాలు వాస్తవ చిత్రానికి పక్కా ప్రతిబింబాలుగా ఉన్నాయి.

2020 మార్చి 25 నుంచి దేశ వ్యాప్త లాక్‌డౌన్ విధించగా అన్‌లాక్-5 నిబంధనల్లో అక్టోబర్ 15 నుంచి విద్యాసంస్థలు తెరుచుకునేందుకు కేంద్రం అనుమతించింది. అది కూడా రాష్ట్రాల ఇష్టానికి వదిలేసింది. దాంతో చాలా చోట్ల స్కూళ్లు తెరుచుకోలేదు. పైపెచ్చు తమ పిల్లలను తమ ఇష్టపూర్వకంగా బడులకు పంపుతున్నట్లు తల్లిదండ్రుల నుంచి రాతపూర్వక డిక్లరేషన్‌ను తప్పనిసరి చేయడంతో పేరెంట్స్ భయపడుతున్నారు. లాక్‌డౌన్ నుంచి మొదలు పెడితే కరోనా నుంచి పూర్తిగా కుదుట పడేంత వరకు డిజిటల్ ఎడ్యుకేషనే పిల్లలకు దిక్కుగా కనిపిస్తోంది. ఈ అనివార్యత ముందున్న వేళ అసర్ అధ్యయనంలో వెల్లడైన క్షేత్ర స్థాయి ఇబ్బందులు మన మన విద్యారంగాన్ని అతలాకుతలం చేస్తాయని, భావి భారత పౌరులుగా ఎదగాల్సిన పిల్లల భవిష్యత్తును అగాధంలో నెడతాయన్న భయాందోళనలు కలుగుతున్నాయి. కరోనా భయం వీడి తరగతి గదుల్లో సురక్షితంగా విద్యార్థులు అడుగు పెట్టే వరకైనా పాఠ్యపుస్తకాలు, స్మార్ట్‌ఫోన్లు, లెర్నింగ్ మెటీరియల్ ట్రాన్స్‌మిషన్, పిల్లలకు వ్యక్తిగత ట్యూషన్ సెషన్ల నిర్వహణ వంటి కనీస చర్యలకు ప్రభుత్వాలు పూచీ పడాలన్న అసర్ వారి సూచన సహేతుకమైంది. కేరళ, కర్నాటక, తమిళనాడు, ఢిల్లీ రాష్ట్రాల్లో కరోనా కంటే ముందే సర్కారీ స్కూళ్లల్లో డిజిటల్ క్లాస్‌రూమ్ కాన్సెప్టును అక్కడి ప్రభుత్వాలు తీసుకొచ్చాయి. కేరళ వంద శాతం స్కూళ్లను డిజిటలైజ్ చేసి ఆదర్శంగా నిలిచింది.

స్కూళ్లు ఎప్పటి నుంచి తెరుచుకోవచ్చో చెప్పడానికి కేంద్రం పరిమితమైంది. సరిగ్గా కరోనా సమయంలోనే విద్య కార్పొరేటీకరణ, కాషాయీకరణ లక్ష్యంగా కొత్త విద్యా విధానాన్ని తెచ్చిన మోడీ సర్కారు విద్యారంగంలో ప్రభుత్వ పెట్టుబడులు పెంచుతుందని ఆశించలేం. ఇక మన రాష్ట్రంలో నవంబర్ 2 నుంచి మూడు దశల్లో స్కూళ్లు తెరిచేందుకు ప్రభుత్వం నిర్ణయించి అమలులోకి తెచ్చినా ప్రాథమికోన్నత మరియు ఉన్నత పాఠశాలలో మాత్రమే తరగతులు నిర్వహిస్తున్నారు. పాఠశాలల్లో కోవిడ్ ప్రొటోకాల్స్‌ను విధిగా పాటించేలా బాధ్యత తీసుకోవాల్సింది ప్రభుత్వమే. పిల్లలను ఎవరి శానిటైజర్ వాళ్లనే ఎవరి మాస్క్‌ను వాళ్లనే తెచ్చుకోమంటే కుదరదు. ప్రభుత్వ ఆరోగ్య సిబ్బందిని స్కూళ్ల వద్ద ప్రత్యేకంగా నియమించాలి. కొంత మేర ఆన్‌లైన్ స్టడీకి అవకాశం ఇచ్చినందున అందుకు కావాల్సిన సదుపాయాలను సర్కారే కల్పించాలి. ఆన్‌లైన్ క్లాసులు ప్రభుత్వ, ప్రైవేటు విద్యార్థులకు ఒకేలా ఉండాలి. ఈ కనీస చర్యలకు ప్రభుత్వం ముందుకు రాకపోతే అసర్ అధ్యయనానికి మించిన విపత్కర పరిస్థితులు నెలకొంటాయి.

బడులు పూర్తిగా తెరుచుకున్న దేశాల్లో అనుభవాలు చూస్తే భయం కలుగుతుంది. స్వేచ్ఛగా, ఆడుతూ పాడుతూ చదువుకోవాల్సిన పిల్లలు తెలియని ఒక ఉద్రిక్త వాతావరణంలో దూరం దూరంగా... భయంభయంగా తరగతి గదుల్లో కూర్చుంటున్నారు. ఇక ఆటపాటల మాట చెప్పనవసరమే లేదు. ఈ సమస్యనుంచి సాధ్యమైనంత త్వరగా ప్రపంచం గట్టెక్కగలిగితే మళ్లీ బడులు మునుపట్లా కళకళలాడతాయి. ఈలోగా బడుల్లో మౌలిక సదుపాయాలు మొదలుకొని విద్యాబోధన వరకూ అన్ని లోపాలను ప్రభుత్వాలు చక్కదిద్దాలి.

## పాఠకుల అభిప్రాయాలు పంపండి

**"ఐక్యఉపాధ్యాయ"** మాసపత్రిక ఉపాధ్యాయ సమస్యలు, ఉద్యమాలతో పాటు అనేక సామాజిక, ఆర్థిక, అకడమిక్ అంశాలపై వ్యాసాలు ప్రచురిస్తోంది. కథలు, కవితలతోపాటు పలు శీర్షికలు నిర్వహిస్తోంది. వీటిపై పాఠకుల ప్రతిస్పందనను ఆహ్వానిస్తున్నది. పత్రికలో ప్రచురితమైన అంశాలపై మీ అభిప్రాయాలు మరియు ఏఏ అంశాలు వుంటే బాగుంటుందో మా దృష్టికి తీసుకు వస్తే మరింత పదును పెట్టుకోవడానికి వీలవుతుంది. మీ అభిప్రాయాలు క్లుప్తంగా, సూటిగా ఉత్త రాల ద్వారాగానీ, మెయిల్ ద్వారాగానీ తెలియజేయగలరు.

**ఉత్తరాల ద్వారా...**

**"ఐక్యఉపాధ్యాయ"** యుటియఫ్ ఆఫీస్, 27-31-11, పాలపర్తివారి వీధి, గవర్నరుపేట, విజయవాడ. 520002.

ఇ-మెయిల్ :**ikyopadhyaya1975@gmail.com**కి పంపవచ్చు.

**- సంపాదకవర్గం**

# పిల్లల్లో చదువుల ఫోబియా

(బడి, టీచరు, అక్షరాలు, అంకెలు, పరీక్షలు)



సి. వి. కృష్ణయ్య
జనవిజ్ఞాన వేదిక

పిల్లల్లో చదువులకు సంబందించి అనేక ఫోబియాలుంటాయి. వీటిని గురించి తెలుసుకొనేముందు అసలు ఫోబియా అంటే ఏమిటి? అర్థం చేసుకొందాం...

ఒక్క మాటలో చెప్పాలంటే అనవసరంగా అతిగా భయపడడాన్నే ఫోబియా అంటారు. ప్రతి ఒక్కరికీ భయాలనేవి ఉంటాయి. పాములు పట్టేవాడికి కూడా పాములంటే భయం ఉంటుంది. అవకాశం దొరగ్గానే పాము కాటేస్తుందని పాములు పట్టేవాడికి తెలుసు. అందుకే భయంతో జాగ్రత్తగా ఉంటాడు. ఏ మాత్రం భయం లేకపోతే అజాగ్రత్తగా ఉంటాం. ప్రమాదాలకు గురి అవుతాం. అందువల్ల ఎంతవరకు భయం ఉండాలో అంతవరకు భయం ఉండడం అవసరం. కాని వంటిట్లో బొద్దింకను చూసి పారిపోతే ఇంట్లో ప్రశాంతంగా ఎలా ఉంటారు?

అతిగా భయపడడంతోపాటు విపరీతంగా ఆందోళన చెందడం, అతిగా ఆలోచించడం, సమస్యకు దూరంగా పారిపోవడం, అశక్తత, ఆతృత వంటి మరికొన్ని ఇతర లక్షణాలు ఉంటాయి. ఈ భయాలు ఇతరుల ముందు బయటపడకుండా ఉండడానికి ప్రయత్నిస్తుం టారు. ఏవో సాకులు చెప్పి భయం కల్గించే వాటికి దూరంగా ఉంటారు.

**పిల్లల్లో ఫోబియాలు :**

ఈ ఫోబియాలు ఎక్కువగా పసితనంలోనే ఏర్పడతాయి. ఇవి కొన్ని వందల రకాలు ఉన్నాయి. ముఖ్యంగా నిప్పు, నీరు, చీకటి, పురుగులు, జంతువులు, ఎత్తు ప్రదేశాలు, ఇరుకు ప్రదేశాలు, రక్తం మొ॥ విషయాలలో ఎక్కువమంది ఫోబియాకు గురవుతూ ఉంటారు.

చదువులకు సంబంధించి బడి, టీచరు, అక్షరాలు, అంకెలు, పరీక్షలు, నలుగురిలో మాట్లాడడం, చదవడం (రీడింగ్) రాయడం వంటి విషయాలలో ఏవో కొన్నిటిలో ఈ ఫోబియాలు ఏర్పడతాయి. కొందరిలో ఇవి జీవితాంతం ఉంటాయి.

**ఫోబియా ఏర్పడడానికి కారణాలు :**

ఈ ఫోబియాలు ఏర్పడడానికి ప్రధాన కారణం అజ్ఞానం. అంటే ఏవి వారిని అతిగా భయపెడుతున్నాయో వాటి గురించి సరైన జ్ఞానం లేకపోవడం. వాటితో ఎలాంటి అనుభవం, పరిచయం లేకపోవడం. తొలిమలి అనుభవాలు చేదుగా ఉండడం. పెద్దల మాటలు. సమాజంలో ఉన్న మూఢనమ్మకాలు. కొన్నిటికి ఏ కారణము లేకపోవచ్చు.

**ఫోబియాలు పోగొట్టడం ఎలా? :**

పసితనంలో ఏర్పడ్డ ఫోబియాల నుండి వయస్సు పెరిగేకొద్దీ కాలక్రమంలో ఎవరికివారు బయటపడతారు. కొందరు స్నేహితుల, వల్ల కుటుంబ సభ్యుల సహకారంతో బయటపడతారు. మరి కొందరికి మానసిక వైద్యుల సహకారం అవసరం కావచ్చు.

ఈ సందర్భంలో నా పసితనంలో జరిగిన ఒక సంఘటన గుర్తు చేస్తాను. ఈ సంఘటన ఏడేళ్ళ వయస్సులో జరిగింది. నేను ఒక పామును కొట్టాను. పగపడుతుం దని భయపెట్టారు. నేను భయపడి పోయాను. అది ఫోబియాగా మారింది. పాములు పగబట్టవని శాస్త్రీయంగా తెలుసుకున్న తర్వాత ఆ పాము ఫోబియా నుండి భయపడ్డాను.

**ఫోబియాల వల్ల జరిగే నష్టం :**

ఈ ఫోబియాల వల్ల ఆనందం ఉండదు. కుటుంబ సామాజిక జీవితాలకు ఆటంకం ఏర్పడుతుంది. వ్యక్తిగత అభివృద్ధి ఆగి పోతుంది. మానసిక శారీరక ఆరోగ్యాలు దెబ్బతింటాయి.

**బడి ఫోబియా :**

పిల్లల్లో బడి ఫోబియా ఏర్పడడానికి కారణం తల్లిదండ్రులే. అది ఎలా మొదలవుతుందో చూద్దాం.

పిల్లలకు ఏడాదిన్నర వయస్సు రాగానే ఇల్లంతా పరుగులుదీస్తూ ప్రతి వస్తువును ముట్టుకుంటూ ముద్దుముద్దుగా మాట్లాడుతూ వుంటారు. తల్లిదండ్రులకు ఇది ముచ్చటగా ఉంటుంది. ముచ్చటతో పాటు ఎక్కడ పడిపోయి దెబ్బలు తగులుతాయోనని భయపడుతూ వుంటారు. వస్తువులు పగలగొడతాడని పిల్లవాడి పనులకు అడ్డు తగులుతుంటారు. బిడ్డకు కాపలాకాయలేక ఇబ్బంది పడుతూ వుంటారు. రెండున్నరేండ్లు రాగానే ప్రతిదాన్ని ప్రశ్నించడం మొద లవుతుంది. వాదనకు దిగుతారు. అలవోకగా అబద్దాలు ఆడతారు. అంతటితో ముచ్చట్లు మురిపాలు తీరిపోయి "ఈ పిల్లాడితో వేగడం కష్టం" అనే భావం ఏర్పడుతుంది. ఎప్పుడెప్పుడు కాన్వెంట్లో వేద్దామా కాస్తంత విశ్రాంతిగా ఊపిరి పీల్చుకొందామా అనుకొంటూ వుంటారు. కొన్నిసార్లు కోపంపట్టలేక మనస్సులో మాటలు పైకి అనేస్తారు. "నువ్వు మాట వినడంలేదు. బడికి పంపితేగాని నీ తిక్క కుదరదు. టీచర్ చేతిలో దెబ్బలు పడితేగాని దారికి రావు. అక్కడ ఈ అల్లరి కుదరదు. కాస్తంత కుదురుగా ఉండడం నేర్చుకో" ఇలాంటి మాటలు అంటూ ఉంటారు. పిల్లలు అన్నం తినకపోతే అదిగో దెయ్యం పట్టుకుపోతుంది వంటి మాటలతో కల్గించే భయాన్నే బడిని గురించి కూడా కల్గిస్తారు. పిల్లల మనస్సులో బడి తనను ఏడ్పించే భూతం అనే భావం ఏర్పడుతుంది. ఇలా మొదలైన బడి భయం బడికి వెళ్లే రోజుకు తారాస్థాయికి చేరుకుంటుంది. ఒక ఫోబియాగా మారిపోతుంది.

తల్లిదండ్రులు బలవంతంగా లాక్కొనిపోవడం పిల్లలు ప్రతి ఘటించి ఏడ్వడం మేక పిల్లను వధశాలకు ఈడ్చుకొనిపోయినట్లే

ఉంటుంది. కొందరు పిల్లలైతే నన్ను బడికి పంపవద్దు నీ మాట వింటానంటూ ఎక్కిళ్లు పెట్టి ఏడ్వడం చూస్తాం. మరికొందరు పిల్లలు కిందపడి దొర్లుకొంటూ ప్రతిఘటిస్తారు. ఎలాగో బలవంతంగా బడికి ఈడ్చుకొని వెళ్ళి కూర్చుండబెడతారు. అక్కడ బడి గురించి తన మనస్సులో ఏర్పడిన అభిప్రాయానికి భిన్నంగా ఆటపాటలతో టీచర్ ప్రేమగా పలకరిస్తూ ఉంటే ఈ ఫోబియా త్వరలో పోతుంది. కాని టీచర్ కటువుగా మాట్లాడుతూ ఆటపాటలు అనేవి లేకుండా బలవంతంగా ఒకే చోట కూర్చుండబెడితే బడి ఫోబియాతోపాటు టీచర్ ఫోబియాకూడా ఏర్పడుతుంది. బడికి పంపడం ప్రతిరోజు తల్లిదండ్రులకు ఒక యుద్ధమే. పిల్లవాడు ఇంటికొచ్చినా రేపు బడికి వెళ్లే విషయమే గుర్తుకు వచ్చి భయపడుతూ తప్పించుకొనే మార్గాలు వెదుకుతూ ఉంటాడు. కడుపునొప్పని తలనొప్పని ఏదో ఒకటి చెబుతూ ఉంటారు. ఇది నిజమో అబద్ధమో తల్లిదండ్రులకు అర్థంగాక తలలు పట్టుకొంటారు. ఇది, తమ స్వయంకృతాపరాధమనే సంగతి గుర్తుకురాదు. బడి పిల్లలకు అనుకూలంగా లేదనే విషయం కూడా గుర్తించరు. చదువుకోవడం ఇష్టంలేదని, అల్లరిపిల్లవాడని, బడిదొంగ అని పిల్లల మీద నెపంవేస్తారు. బడిగాని, చదువుగాని ఆనందంగా ఉండాలి గదా! ఈ బడి ఫోబియా ఇలా ఉండగా టీచర్ ఫోబియా అక్షరాల ఫోబియాలు కూడా కొందరి పిల్లల్లో ఏర్పడతాయి. ఇవి ఎలా ప్రారంభమవుతాయో చూద్దాం.

**అక్షరాల ఫోబియా :**

బడి భయం పోకముందే టీచర్లు అక్షరాలు నేర్పించడానికి పూను కొంటారు. బడిలో అడుగుపెట్టగానే ఏవో కొన్ని వంకరగీతలు (అక్షరాలు) రాసిచ్చి వాటిని దిద్దమనో చూసి రాయమనో చెబుతారు. ఇవి ఏమిటి? ఎందుకు చూసిరాయాలి? ఈ చెత్తపని చేయడానికి మనస్సు అంగీకరించదు. టీచర్‌వైపు బేలగా భయంగా చూస్తారు. టీచర్ 'రాయ్' అంటూ హుంకరిస్తుంది. పిల్లల భయం మరింత పెరుగుతుంది. ఇప్పటివరకు గారాబంగా అమ్మ ప్రేమతో పెరిగిన బిడ్డకు ఇది కొత్తగా ఉంటుంది. స్వేచ్ఛగా ఇష్టమొచ్చినప్పుడు ఇష్టమైన పని చేసే అవకాశం లేకుండా నిర్బంధించడంతో మనస్సు ప్రతి ఘటిస్తుంది. ఆలోచనలన్నీ ఆగిపోతాయి. కళ్లనిండా నీళ్లతో అక్షరాలు అలికినట్లు మసక మసకగా కనిపిస్తాయి. పిల్లవాడు ఏడుస్తాడు. టీచర్ నోర్‌ముయ్ అంటూ బెదిరిస్తుంది. టీచర్‌కు ఇలాంటి పిల్లలు చాలామంది ఉంటారు. వాళ్లను ఎలా సముదాయించాలో క్లాస్ రూమ్‌ను గలభా లేకుండా ప్రశాంతంగా ఎలా ఉంచాలో తెలియదు. భయపెట్టి నోరు మూయించటం ఒక్కటే మార్గంగా కన్పిస్తుంది. ఇది వేల సంవత్సరాలుగా వస్తున్న సంప్రదాయం. పిల్లల మనస్సుల్లో జరిగే యుద్ధ భీభత్సాన్ని చూడలేరు. ఇది ఇలాగే ఉంటుంది అని సమాధాన పడతారు. పిల్లల్లో ప్రతిదీ నేర్చుకోవాలనే ఆకాంక్ష, అర్థం చేసుకోనే శక్తి సామర్థ్యాలకు జరిగే నష్టాన్ని ఎవరూ గమనించరు. ఆ పసి వయస్సులో వారి మనస్సులో చదువుల పట్ల టీచర్ పట్ల ఏర్పడే భయం వ్యతిరేకతలు జీవితాంతం వెన్నంటే ఉంటాయి. తప్పదు గాబట్టి కొన్నాళ్లకు బలవంతంగానైనా చూసి రాయడం అలవాటు అవుతుంది. యాంత్రికంగా ఎన్నాళ్లయినా అలా చూసి రాస్తూనే వుంటారు. ఆ కాగితంలో గీతల మీద వంకరపోకుండా రాస్తుంటారే గాని ఆ అక్షరాలు ఫలానా అవి గుర్తుపట్టలేరు. చూడకుండా ఒక్క అక్షరం రాయలేరు. టీచర్ ఎర్ర ఇంక్‌తో సంతకం చేస్తుంది. ఇంట్లో తల్లిదండ్రులు నోట్ బుక్కులు చూసి సంబరపడి పోతుంటారు. ఏడాదికో రెండేళ్లకో వాళ్లకు ఒక్క అక్షరం ముక్కరాదనే సంగతి తెలిసిపోతుంది.

అప్పుడు ప్రారంభం అవుతుంది మలిహింస. చదువురాని మొద్దు, మొండి, పొట్టకోస్తే అక్షరం ముక్కరాదు నీకు దండగ తిండి పెడు తున్నాం. అంట్లు తోముకోవాల్సిందే. ఇలాంటి మాటలతో ఆ అక్షరాలంటే మరింత భయం పెరిగిపోతుంది. వాటిని నేర్చుకొందాం అని ఎంత ప్రయత్నించినా మనస్సు ఎదురు తిరుగుతుంది. తనను తిట్టిన తిట్లు శాపనార్థాలే గుర్తుకువస్తాయి. నేర్చుకోవడం సాధ్యం గాదు. ఏమి చేయాలి? బడికిపోక తప్పదు. బడి లోపలికి అడుగు పెట్టేముందు ఆ గేటు గోడమీదో పక్కన్ను చెట్టుమీదో తమ మనస్సులు తగిలించి లోపలికి వట్టి శరీరాలను ఈడ్చుకొని వెళతారు. క్లాస్ రూమ్‌లో పరధ్యానంగా ఉంటారు. లేదా మత్తుగా నిద్రలోకి జారు కుంటారు. ఎన్ని ప్రయత్నాలు చేసినా వారి నిద్రమత్తు వదలిపోతు– లాంగ్‌బెల్ కొట్టగానే ఉలిక్కిపడి మేలుకొంటారు. ఆ మనస్సు శరీరంలోకి ప్రవేశిస్తుంది. ముఖంలోకి జీవకళ వస్తుంది. హుషారుగా ఇంటిదారి పడతారు. ఇలాంటి పిల్లలు మూడు మార్గాలు ఎన్నుకొంటారు. పరధ్యానంగా మత్తుగా నిద్రలోకి జారుకోవడం. ఇతర పనుల్లో చురుగ్గా ఉంటూ చదువురాకపోయినా మంచి వాళ్లుగా గుర్తింపు పొందడానికి ప్రయత్నించడం, బడిమానుకోవడం. బడి మానుకోవడం సాధ్యం కాదు కాబట్టి బడికి వస్తూ చదువు మానుకొంటారు. అంటే చదువు నుండి డ్రాపౌట్ అవుతారు. బడి బయట డ్రాపౌట్లు సంగతేమనకు తెలుసు. బడిలో ఉంటూ చదువుల నుండి డ్రాపౌట్లు సంగతి మనం పట్టించుకోవడంలేదు. వీరి సంగతి మరోసారి ముచ్చటించుకొందాం. ఇప్పుడు అంకెల ఫోబియా ఎలా మొదలవుతుందో చూద్దాం. **(తరువాయి వచ్చే సంచికలో)**


## ఐక్యఉపాధ్యాయ పత్రిక చందా రేట్లు

| | | |
|---|---|---|
| విడి పత్రిక | రూ. | 15.00 |
| సంవత్సరం చందా | రూ. | 150.00 |
| అర్ధ దశాబ్ది చందా (5 సం॥లు) | రూ. | 650.00 |
| దశాబ్ది చందా (10 సం॥లు) | రూ. | 1250.00 |

## ఐక్యఉపాధ్యాయలో ప్రకటన రేట్లు

| | | |
|---|---|---|
| 4వ కవర్ పేజీ (కలర్) | రూ. | 30,000.00 |
| 2,3 కవర్ పేజీ (కలర్) | రూ. | 20,000.00 |
| లోపలి పేజీ (బ్లాక్ & వైట్) | రూ. | 10,000.00 |
| ॥ ఆప్షనల్ | రూ | 11,000.00 |



# రైతు ఉద్యమం అందరిదీ
# అందుకే అది గెలవాలి...

దేశవ్యాపితంగా రైతాంగ ఉద్యమానికి అపూర్వ సంఘీభావం వెల్లడవుతోంది. ఇప్పటివరకు మోడీ అనుసరిస్తున్న విధానాల వల్ల బాధపడుతున్న వివిధ తరగతుల ప్రజానీకానికి రైతాంగ ఉద్యమం స్ఫూర్తిదాయకంగా నిలుస్తోంది. వర్తమాన దేశ చరిత్రలోనే కనీవినీ ఎరుగని రీతిలో నలభై రోజులకు పైగా లక్షలాది ప్రజానీకం ఢిల్లీ సరిహద్దుల్లోనే రోడ్లపై బైఠాయించి నిరసన వ్యక్తం చేస్తున్నారు. అక్కడే గుడారాలు వేసుకొని భోజనాలు వండుకొని తింటూ వచ్చిపోయే వారికి కూడా వడ్డిస్తూ తమ నిరసనలను కొనసాగిస్తున్నారు. గడ్డ కట్టే చలిలో ఉండటమే కాదు జనవరి 3వ తేది ఊహించని రీతిలో భారీ వర్షం వచ్చినా తడుస్తూనే నినాదాలతో వేడి పుట్టించారు తప్ప వెరవలేదు. వెనుతిరగనూ లేదు. పోరాడి గెలవగలమన్న ధీమా వారి కళ్లల్లోనే కనిపిస్తోంది.

కొంతమంది ఇది పంజాబ్, హర్యానా రైతులకు మాత్రమే పరిమితమైన సమస్య అనుకుంటున్నారు. మరికొంతమంది ఇదేదో రైతుల గోడులే అనుకుంటు న్నారు. మరికొందరు ప్రభుత్వ తప్పుడు ప్రచారానికి లోనయి ఈ ఉద్యమాన్ని చిన్న చూపు చూస్తున్నారు. కాని రోజులు గడిచేకొద్దీ రైతులది సాధారణ కోర్కెల కోసం సాగే పోరాటం మాత్రమే కాదు ఇది జాతి కోసం సాగుతున్న ధర్మ పోరాటమని అర్థం చేసుకుంటున్నారు. ప్రతిపక్షాలు మాత్రమే కాదు బిజేపీని బలపరిచే మిత్ర పక్షాలు కూడా ఉద్యమం పట్ల సానుభూతి చూపిస్తున్నారు. అధికారంపై యావ కొద్దీ ఉద్యమానికి దూరంగా ఉంటున్న వారు కూడా ఇది న్యాయమైన పోరాటమేనని ఒప్పుకుంటున్నారు. అంతే కాదు బిజేపీ అనుబంధ రైతుసంఘం కూడా సనుగుతూనైనా ఇది లోప భూయిష్టమైన చట్టమని, తీవ్రమైన సవరణలు చేయాలని వాదిస్తోంది. ఆర్.యస్.యస్ అనుబంధ సంస్థ స్వదేశీ జాగరణ్ మంచ్ ఏకంగా ఈ చట్టాలను రద్దు చేయాలని కోరుతోంది. ప్రముఖ ఆర్థిక వేత్తలు ఈ చట్టాలు రైతులకు వ్యతిరేకమైనవని స్పష్టంగా చెప్తున్నారు. ఆఖరికి రిలయన్సు అధినేత కూడా బహిరంగంగా మీడియా ముందుకొచ్చి తాము రైతుపోరాటానికి వ్యతిరేకం కాదని వారికి మద్దతు ధర కావాల్సిందేనని చెప్పక తప్పలేదు. ఇంతకీ ఇంతకీ రైతులు ఈ జీవన్మరణ పోరాటం ఎందుకు చేస్తున్నారు?



వి.శ్రీనివాసరావు

2020 జూన్‌లో ఉన్నట్లుండి మోడీ ప్రభుత్వం మూడు ఆర్డినెన్సులు తీసుకొచ్చింది. దేశ ప్రజలంతా కరోనా మహమ్మారిపై పోరాటం సాగిస్తుంటే మోడీ ప్రభుత్వం ఆర్థిక సంస్కరణలను వేగవంతం చేసి కార్పోరేట్ల సేవలో తరించింది. కొత్తగా మూడు వ్యవసాయ చట్టాలు తెచ్చింది. కార్మిక హక్కులపై వేటు వేస్తూ 44 శాసనాలను కోడ్‌ల కింద మార్చి హక్కులను హరించింది. విద్యారంగాన్ని కార్పోరేటీకరణ చేయడమే కాదు కాషాయపూరితం చేసింది. ఇలా దొంగ చాటుగా అనేక చట్టాలు చేసి దేశ ప్రజలను దెబ్బతీసింది. ఇవన్నీ దేశం కోసం, ప్రజల కోసమే నంటూ మోడీ పచ్చి అబద్దాలు ప్రచారం చేస్తున్నాడు. ఎవరైనా వీటిని వ్యతిరేకిస్తే వారంతా దేశద్రోహులుగా చిత్రీకరించబడుతున్నారు. నేడు రైతాంగ పోరాటంపైనా అదే రకమైన దాడి జరుగుతోంది. ఇది పాకిస్తాన్, చైనా ప్రేరేపిత ఉద్య మమని బురద చల్లుతోంది, ఆ విమర్శలను, ప్రచారాలను ప్రజానీకం పట్టించుకోవడం మానేశారు. ప్రతిపక్ష ప్రేరేపిత ఉద్యమమని తెగనాడారు. నిజానికి ఉద్యమం వచ్చాకే ప్రతిపక్షాలు రంగంలోకి వచ్చాయి తప్ప రాజకీయ పార్టీలు ప్రేరేపిస్తే వచ్చిన ఉద్యమం కాదిది. అందుకే స్వయం ప్రేరేపితమైన ఈ ఉద్యమంలో లక్షలాది మంది పేద, మధ్య తరగతి రైతులు ప్రాణాలకు తెగించి ఢిల్లీ సరిహద్దుల్లో పోరాడుతున్నారు. ఇప్పటికే 60 మంది వరకు చనిపోయారు. ఇంకెందరు బలిదానం చేయాల్సి వస్తుందో తెలియదు. మోడీ మొండితనం, మూర్ఖత్వం వల్ల దేశానికి అన్నం పెట్టే రైతన్న నిండు ప్రాణాలు గాలిలో కలసి పోతున్నాయి.

**ఈ చట్టాల్లో ఏముంది?**

1. మోడీ చెపుతున్నట్లుగా రైతులకు స్వేచ్ఛ వస్తుందా? రైతులు తమ ఉత్పత్తుల్ని ఏ ధరకైనా, ఎక్కడైనా అమ్ముకొని రెట్టింపు లాభం చేసుకోవచ్చా? ఇది మోసపూరిత వాదన. ఈ చట్టం రైతులకే కాదు ఏధరకైనా, ఎక్కడైనా కొనుక్కోడానికి కార్పోరేట్ కంపెనీలకు కూడా స్వేచ్ఛనిచ్చింది. రైతులకు, కార్పోరేట్ కంపెనీలకు కలిపి ఇచ్చిన ఈ స్వేచ్ఛ ఆచరణలో ఎవరికి ఉపయోగపడుతుంది. అడవిలో మేకలను, తోడేళ్లను స్వేచ్ఛనిచ్చి వదిలితే ఆ స్వేచ్ఛ దేనికి ఉపయోగ పడుతుందో చిన్న పిల్లవాడినడిగినా చెపుతాడు. మేకలకు ఇచ్చిన స్వేచ్ఛ తోడేళ్లకు ఆహారంగా మారే స్వేచ్ఛ అవుతుంది. అలాగే ఇది కూడా మార్కెట్ లో కార్పోరేట్లు రైతుల్ని బలితీసుకొనే స్వేచ్ఛగా ఇది మారుతుంది. ఈ రోజు ఎక్కడైనా అమ్ముకునే స్వేచ్ఛ లేక రైతులు దివాళా తీయడం లేదు. మార్కెట్ లో ధరలు లేక నష్టపోతున్నాడు. అది ఇక్కడా అక్కడా అని లేదు. దేశంలో ఎక్కడా లేదు. అన్ని రాష్ట్రాల్లోనూ నష్టపోతున్నారు. అందుకే జమ్ముకాశ్మీర్ నుండి కన్యాకుమారి వరకు అందరూ ఈ రైతు ఉద్యమంలో భాగస్వాములవు తున్నారు. ఒక చోట ఎక్కువుంటే రెండో రోజుకి తగ్గిపోతున్నది. ఒకరోజు ఎక్కువ రేటు వుంటే మరుసటి రోజుకి తగ్గిపోతున్నది. ఆ పంటా, ఈ పంటా అని కూడా తేడా లేదు. ఒక పంటకు ఒక సంవత్సరం మంచి ధర వస్తే అదే పంటకు రెండో సంవత్సరం ధర పడిపోతున్నది. మంచి

ధర ఉంది కదా రైతులు దాన్ని ఎక్కువ పండిస్తే పడిపోతున్నది. అందుకే రైతులు దివాళా తీయకుండా ధరల స్థిరీకరణ ఉండాలని ప్రతి ఒక్కరూ నేడు అంగీకరిస్తున్నారు. కాని మోడీ చట్టాలు ఉన్న కొద్దిపాటి స్థిరీకరణను కూడా దెబ్బకొట్టి మార్కెట్ పై అదానీ, అంబానీ వంటి బడా కార్పొరేట్లకు ఆధిపత్యమిస్తున్నారు. అందుకే ఇవి వ్యవసాయ చట్టాలు కాదు వ్యాపార చట్టాలని ఆర్థిక వేత్తలు చెప్తున్నారు.

2. ఈ చట్టాల వల్ల మార్కెట్ యార్డులు మాయమవుతాయి. మార్కెట్ యార్డులేకపోతే ప్రభుత్వ జోక్యం ఉండదు. మార్కెట్ యార్డులు కేంద్రంగానే కనీస మద్దతు ధరలు నిర్ణయించి, వాటిని ప్రైవేటు వ్యాపారస్తులు కొనకపోతే ప్రభుత్వమే కొనే గ్యారంటీ అది ఇస్తుంది. అలాంటి కొనుగోళ్లు మార్కెట్ యార్డుల ద్వారానే జరుగుతాయి. మన రాష్ట్రంలోనూ అదే అనుభవం. ప్రభుత్వ ఆధ్వర్యంలోని మార్కెట్ యార్డులను రద్దు చేసి, కార్పొరేట్లు నిర్వహించుకునే ప్రైవేటు మార్కెట్ యార్డులకు ఈ చట్టం పూర్తి అధికారం ఇస్తుంది. వారే ధరలు నిర్ణయిస్తారు. వారు చెప్పిన రేటుకే రైతులు అమ్ముకోవాలి.

3. ఈ చట్టాలు కనీస మద్దతు ధరల అమలు గురించి మాట మాత్రం కూడా ప్రస్తావించలేదు. అంటే ఆచరణలో కనీస మద్దతు ధరలు ఎందుకూ కొరగావు, ఈ మద్దతు ధరలను నిర్ణయించడమే లోపభూయిష్టంగా ఉంది, కాని ఇప్పుడు అది కూడా అమలయ్యే దిక్కులేదు. స్వామినాథన్ సిఫార్సుల ప్రకారం వడ్డీ, కౌలు సహా పెట్టుబడిపై 50శాతం కలిపి ధర నిర్ణయించాలి. కాని నేడు ప్రభుత్వం ఆ బాధ్యత నుండి తప్పుకుంటోంది. అందుకేకనీసం మద్దతు దరలకు రైతుసంఘాలు కోరుతున్నట్లుగా చట్టబద్ధత కల్పించడానికి నిరాకరిస్తోంది. తమ మాటనే హామీగా తీసుకొని ఆందోళన విరమించాలని చెప్తున్నారు. నోటి మాటకు విశ్వసనీయత ఉంటే నేడు దేశం ఇలా దిక్కుమాలిన విధంగ మారదు. గిట్టుబాటు ధరలకు చట్టబద్ధత కల్పించడానికి నిరాకరిస్తున్న ప్రభుత్వం కార్పొరేట్ కంపెనీలకు లాభం మాత్రం గ్యారంటీ చేసింది. అందుకే ఇది కార్పొరేట అనుకూల చట్టమని అందరూ చెప్తున్నారు.

4. ఈ చట్టాల్లో మరొకటి కాంట్రాక్టు వ్యవసాయ చట్టం, అన్నింటిలోకి అసలు కీలకమైన చట్టమే ఇది. రైతులు గ్రామాల్లో సంఘాలుగా ఏర్పడి కార్పొరేట్ కంపెనీలతో ఒప్పందాలు చేసుకోవాలి. వారడిగిన రేటుకే పంటలు అమ్ముకోవాలి. మొదట చెప్పినట్లు రైతులు తమ ఇష్టానుసారం తమ పంటల్ని ఎక్కడైనా అమ్ముకునే స్వేచ్ఛను ఇది హరిస్తుంది. ఒప్పందాన్ని ఉల్లంఘించి ఎవరైనా బయట అమ్ముకుంటే వారిపై కేసులు నమోదు చేస్తారు. కేసుల్ని విచారించేది ఆర్డీఓలు, కలెక్టర్లు వీరు ఎవరికి అనుకూలంగా తీర్పులిస్తారో వేరే చెప్పాల్సిన అవసరం లేదు. ఒప్పందం ప్రకారం కంపెనీలు రైతుల వద్ద కొనకపోతే చేయగలిగేదేమీ ఉండదు. నాణ్యత పేరుతో సరుకుల ధరల్ని దిగ్గోసిన అనుభవాలు ఇప్పటికే రైతులకు బోలెడున్నాయి. పంజాబ్, హర్యానా వారికే కాదు మన రాష్ట్రంలోనూ ఇది అనుభవమే. అందుకే కార్పొరేట్ పెత్తనం వద్దని రైతులు ఘోషిస్తున్నారు. ఈచట్టాలను అదానీ, అంబానీలే తయారు చేసి ఇచ్చారని మీడియా కోడై కూస్తోంది. వారి కోసమే మోడీ ఈ చట్టాలు తెచ్చాడు. అందుకే రైతులు అదానీ, అంబానీ ఉత్పత్తుల్ని బహిష్కరించాలని పిలుపునిచ్చారు. జియో కనెక్షన్లను తీసేశారు. పంజాబ్, హర్యానాలలో జియో టవర్స్ పై దాడులు జరిగాయి. దానితో అంబానీ రిలయన్సు కంపెనీ కోర్టు కెక్కడమే కాకుండా, తమకు వ్యవసాయ కాంట్రాక్టులోకి వచ్చే ఆలోచనే లేదని బహిరంగంగా ప్రకటించింది. ఇది అబద్ధమని అందరికీ తెలుసు, కాని ప్రజాగ్రహం నుండి తప్పించుకోడానికి వారు ఇలా చెప్పి తప్పుకోవాల్సి వచ్చింది.

5. నిత్యాజీవితావసర సరుకుల చట్ట సవరణ చేయడం ద్వారా కార్పోరేట్ కంపెనీలు తమ సరుకుల్ని ఎంతైనా నిల్వ చేసుకోవచ్చు. దీని వల్ల రైతులు తమ ఉత్పత్తుల్ని అమ్ముకున్నాక కంపెనీలు ధరలు పెంచి మార్కెట్లోకి వదులుతారు. వినియోగదారులపై పెనుభారం మోపుతుంది. బియ్యం మొదలు కొని కూరగాయలు, పండ్లు వరకు అన్ని వ్యవసాయ ఉత్పత్తుల దరలు పెరిగిపోతాయి. రైతులకు గిట్టుబాటు ధర రాదు, కాని వినియోగదారులపై విపరీతమైన భారం పడుతుంది. వినియోగ ధరల సూచిక ఆకాశానికి ఎగబాకుతుంది. ద్రవ్యోల్బణం పెరుగుతుంది. నిజవేతనాలు పడిపోతాయి. పేదలకు తిండికి దూరమవుతారు. తగినంత ఆహారం లేక పిల్లలు పోషకాహార లోపానికి గురవుతారు, పేదలు ఆకలి చావులకు గురవుతారు. ఇప్పటివరకు రైతుల ఆత్మహత్యలే చూశాం. ఇక ముందు మరల ఆకలి చావులు కడూ చూడబోతున్నాం. ఈ చట్టాలు కార్పోరేట్లకిచ్చిన స్వేచ్ఛకు నిత్యాజీవితావసర సరుకుల చట్ట సవరణే చక్కటి ఉదాహరణ.

6. ఈ మూడు చట్టాలతో పాటు విద్యుత్ చట్టాన్ని కూడా సవరించారు. దీని ప్రకారం డిస్కాంలను ప్రైవేటుపరం చేయాలి. వ్యవసాయ పంపుసెట్లకు ఉచిత విద్యుత్ స్థానంలో నగదు బదలి పథకం ప్రవేశపెడతారు. బిల్లులు కట్టకుంటే కరెంటు వెంటనే కట్ అవుతుంది. సెల్ ఫోన్ల మాదిరే కరెంటు స్మార్టు మీటర్లు పెట్టి ప్రీపెయిడ్, పోస్టు పెయిడ్ కనెక్షన్లు ఇస్తారు. ప్రతి ఇంటికీ ఈ స్మార్టు మీటర్లు బిగిస్తారు.

7. పై చట్టాల అమల్లోకి వస్తే రైతులు దివాళా తీస్తారు. అప్పులు పెరుగుతాయి. పొలాలు అమ్ముకోవాల్సిన దుస్థితి వస్తుంది. భూములు కోల్పోతారు. రైతు వ్యవసాయం కార్పోరేట్ వ్యవసాయంగా మారుతుంది. కౌలుదార్లకు భూముల దొరకవు, కూలీలు ఉపాధి కోల్పోతారు, ఆహర ధాన్యాల ధరలు ఆకాశాన్నంటుతాయి. పేదలకు తిండి అందుబాటులో ఉండదు. ప్రజా పంపిణీ వ్యవస్థ రద్దు అవుతుంది. గ్రామీణ ఉపాధి హామీ పథకం కూడా రద్దవుతుంది. ధరలు పెరిగి వినియోగదారులపై పెనుభారం పడుతుంది. ఆరీత్యా ఇవి జాతి వ్యతిరేక చట్టాలు, రైతులకే కాదు సర్వ ప్రజానీకానికి ఇవి వ్యతిరేకం. ఇది రైతుల కోసం సాగుతున్న ఉద్యమం కాదు. జాతీయోద్యమం అందరి ఉద్యమం. ఆర్థిక సంస్కరణలకు వ్యతిరేకంగా సాగుతున్న సమరం. అందుకే మోడీ ఈ చట్టాల కావాలంటున్నాడు, అందుకే రైతులు వీటిని వద్దంటున్నారు. మనం ఎవరి పక్షమో తేల్చుకోవాలి. రైతన్నలకు మద్దతుగా ఉపాధ్యాయులు కూడా ముందుకు రావాలి. ఇప్పటికే యుటియఫ్, ఎస్.టి.ఎఫ్.ఐ. వంటి సంఘాలు చొరవ తీసుకొని ముందుకొచ్చి రైతు ఉద్యమానికి చేదోడువాదోడుగా ఉన్నాయి. ఉపాధ్యాయ లోకమంతా రైతులకు మద్దతుగా నిలబడాలి. అది రానున్న రోజుల్లో ఉపాధ్యాయ హక్కుల కోసం సాగే ఉద్యమాలకు కూడా ఊపునిస్తుంది. గతంలో కార్మిక, ఉపాధ్యాయ, ఉద్యోగుల ఉద్యమాలను వ్యతిరేకించి దాడి చేసిన జేపీ లాంటి మేధావులు నేడు ఈ రైతాంగ ఉద్యమాన్ని కూడా వ్యతిరేకిస్తున్నారు. దాన్ని బట్టే వారి నైజం అర్థమవుతుంది. విష ప్రచారాలను తిప్పికొట్టి రైతు ఉద్యమానికి అండగా నిలబడాలి. ఈ విషయంలో ఉపాధ్యాయులు ముందు పీఠిన ఉండాలి.

కథల పోటీలో తృతీయ బహుమతి పొందిన కథ

# బతుకమ్మ



పర్కపెల్లి యాదగిరి
సిద్దిపేట జిల్లా

**(డిసెంబర్ సంచిక తరువాయి)**

"ఏందవ్వ.. ఏమన్న కోట్లు సంపాయించి పెట్టినవా..సచ్చిన్నాడు నోట్లే పెడుదామంటే నల్ల బూసల్ల తెల్లరాయి లేదు..అలుమొగలు ఏరు సంసారం బెడితిరి.. అన్ని నాకి కూసుంటిరీ..బొంబాయికి బీమండికి బతుకపోయినోళ్లు శపాన్ని ఈడీదాక ఏసుకచ్చుకుంటరా...ఇయ్యల్ల ఈడికెళ్లి పోయినవంటే మల్ల వంత వరకు ఈడికి రావద్దనే కోరుకుంటాన..ఏమన్న సంతపిల్లున్నదా..కిరాయికొంప.. ఏరుగుల్లు ఉచ్చలు పోసుకుంటే ఎవరు చెయ్యాలె.. ఏదో జీవి పోయిన కాడికచ్చి తలగోరు పెడతడు...వత్తడు.." అంది చిన్నకొడలు.

బతుకమ్మ తలవంచుకొని కూర్చుంది.

"నీ యవ్వా..ఓ...నా పెనిమిటి దాపున్నే పెట్టాలె.. నా అత్తమామల బొక్కలు పోయిన కాన్నే నా బొక్కలు పోవాలే... ఓ..లేకుంటే నా బతుకే దండుగ..జెర మీరు నా కొడుకులకు చెప్పాలే.. అని యెదురైనోల్లకల్ల చెప్పవడితివీ..నా ఇజ్జతి తీసి పెంటమీద ఎయ్యవడితివీ..చెప్పెటోడు పైసి త్తడా.. వరికిత్తడా.. చెప్పేటానికేమున్నదీ..ఎవ్వడైనా చెప్తడూ... ఏదీ నా ముందటికి రమ్మనూ.." అన్నాడు చిన్నకొడుకు.

"అవును బిడ్డలాలా..మీకు మీ పెండ్లాలకు చెప్పే దమ్ములు ఎవలకు లెవ్వు" అంది బతుకమ్మ.

"ఏందవ్వా..ఏందో మబ్బులనే లొల్లికే కూసున్నావూ.. పరాకత్గా.. పో..నువ్ చెప్పుకున్నోల్లను ఒచ్చి చెయ్యిమనుపో నీ సావు..ఓ..జాగలు బంగ్లాలు సంపాయించి ఇచ్చినోల్లనే మెడలు వట్టి నూకుతాండ్లు అవుతలికి..నీకు గంజిపోసుడే ఎక్కువ.. ఈడనెల ఆడనెల ఉ ఒడుకుంట కాలమెల్లదియ్యక ఏందవ్వా.. సచ్చినంక షెత్త యాడబోతే ఏమున్నది.." అంది చిన్నకొడలు.

"అవ్వా..ఇన్నన్ని చాయబోట్లు అది పొత్తది.. తాగి సక్కగ జనుగామ్ బస్సెక్కు.., లొల్లి పెట్టకు..ఎవలన్నింటే ముసల్దాన్ని గోస పెట్టుకుంటాన్లు అనుకుంటరు.." అన్నాడు చిన్న కొడుకు.

"కుక్కల కొడుకులు ముగ్గురు బదురుకున్నారూ...మీ చాయబొట్లోద్దూ...మీ బుక్కెడు బువ్వొద్దూ.. నేను ఎవ్వనింటికి పోనూ..నా సావేదో నేనే సత్తా.." అంది బతుకమ్మ.

"ఏ..పో..అవ్వా పో..నీకు పించను ఒత్తదని బిర్రు.." అంది చిన్నకోడలు.

"నీ అడ్డమైన మొకమల ఉచ్చపొయ్య..ఆ పించను ఆ కారటు నాకెమెరుకనే..ఆ పైసల మొకము నాకెమెర్క.. ఎవ్వని దగ్గరుంటే వాడే తీసుకోవట్టే.."

"బరాబరి తీసుకుంటరూ..ఏమన్న ఎకురాలకొద్దీ సంపాయించి ఇచ్చినవా.. మేమేమన్న పండిచ్చుక తింటన్నమా.."

"అయ్యో..సాలెనుక సాలున్నదే బిడ్డా.. నీకిద్దరు మొగ పోరాగాండ్లున్నరు.. రేపు మూ తిమీద మూతిమీద తంతరుండు.. నాకు ముందట నీకు ఎనుక"

అంది బతుకమ్మ.

ఊతకర్రా సంచీ పట్టుకొని నడుస్తోంది బతుకమ్మ.

'బంగారమసొంటి మనిషి.. నడితొవ్వల కాటగలిపే...ఆయిన జాగల ఆయన పాయే..ఆయినొక్కడుంటే నాకు గీ గోస ఎందుకుండు..యాన్నన్న మారాజోలె..ఇంత వాచి మేను కొలువు చేసు.. వండుకోని ఉన్నదో లేనిదో తిని మలుసుక పంటుమూ.. కోతీమీరికి ఉప్పు నిరపకాయకు సుత అవుతలికి తోలక పోవు.. ఇప్పుడు కోడల్దాని తోటి గిన్నిగిన్ని మాటలు పడవడితిని...కోతకు అమ్మిన గోదోలే ఐపాయే నా బతుకు..' అనుకుంటూ కన్నీళ్లు తుడుచుకుంది.

........ "బతుకమ్మా...నాకేమన్నై గిట్ల జప్పన సచ్చిపోతే ఎట్ల బతుకుతవే...బస్టాండ్ల ఇడిచి పెడితే తొవ్వ పట్టుకోని సక్కగ ఇంటికొచ్చే తెలివి లేకపాయే..ముగ్గురు మూన్నేల్లు ఉండు మంటే...ఆడికి ఈడీకి ఎట్ల తిరుగుతవే...ఏమోనే నిన్నిడిసి నా పానం తుర్తిగ పోదు" అనేవాడు నారాయణ.

"అబ్బో.. నేనె నీ కండ్ల ముంగట నేనే పోవాలే..పోతగూడ... పుట్టెడు రోగాల పుట్టను నేను..అయినా ఈ బట్టేవాజి కోడండ్లతోటి నేనేడ నెగ్గుత.. నువ్వైతే ఎవ్వల నొప్పియ్యకుంట నిబాయించు కొత్తవు... ఏడుకొండలసామికి నిత్తె మొక్కుతాన..నాకు ముత్తైదసావు రావాల్నని.." అనేది బతుకమ్మ.

............

బతుకమ్మ స్మశానవాటికకు చేరుకున్నది. నారాయణ ఖనన స్థలానికి దూరంగా కర్రా సంచీ కింద పెట్టింది. పాదాల మీద కూర్చుంది.

"నాయనా..ఈడ ఇల్లుకట్టుకొని నిమ్మ లంగున్నవా.. నాయనా... నన్నే ఆగం జేసినవా నాయినా... నా పానం బోయినంక నీ దాపుకే పెట్టుమని అడిగిన...వెండి బంగారం అడిగిన్నా... ఏం కొడుకుల సాదినవు నాయినా...ఏం కోడండ్లను తెచ్చుకున్నవు నాయినా..అత్తమామ తోటి ఆడిబిడ్డల తోటి నీతోటి సుత ఒక్కమాట పడకపోతి...వీల్లతోటి మాటలు పడితిని..పానం దస్సుమనవట్టే

నాయినా... ఇప్పటికిప్పుడు సీతమ్మని మింగినట్టు బూమి పలిగి నన్ను మింగినా మంచిగుండు అనిపియ్యవట్టే...... ....” తలుచుకుంటూ ఏడుస్తూనే ఉంది.

ఒంటిగంట దాటింది. రోడ్డు మీదకి వచ్చింది బతుకమ్మ. ఐదు రూపాయల భోజనం తీసుకుంటూ ఉంటే జామకాయల గంప నెత్తిన పెట్టుకొని వెంకటమ్మ పరీక్షగా చూస్తూ ఉంది.

“బతుకమ్మ వదినే... ఏంది గీడికి వచ్చినవూ..” అంటూనే వెంకటమ్మ కూడా భోజనం తీసుకుంది.

బతుకమ్మ విషయమంతా ఏడుస్తూ చెప్పింది.ఇద్దరూ కలిసి స్మశానం వెనుకగల శివాలయానికి వచ్చారు.

“అయ్యో వదినే...మా ఇంటి పక్కన ఉన్నప్పుడు పొలగాల్లు చిన్నగ ఉండిరి..అన్నా నువ్వు మస్తు గోస పడ్డరు.. ఈ కాలం బాడుకావులు ముండలూ గిట్లనే తయారయిండ్లు.. గందుకే నేనెవ్వలకు చేయి చాపకుంట గీ గంప పెట్టుకోని తిరుగుతాన..ఈ గుల్లెనే మలుసుక పంటన్న... నువ్వు ఏడవకు.. నీకిన్ని జామకాయలు పోపిత్త.. ఈ పక్కకే బడి ఉన్నది. ఆడ పెట్టుకోని కూసో..నీ బువ్వ కుక్కలు తినయి..” అంది వెంకటమ్మ.

రెండు రోజులుగా బతుకమ్మ జామకాయలు అమ్ముతోంది.

పెద్దకొడుకూ చిన్నకొడుకూ వచ్చారు.

“అవ్వా ఏందే..యెనుకులాడీ యెనుకులాడీ తకాయించి పోతిమీ... సావుదలకు మమ్ముల బదునామ్ చెయ్యవడితివీ... మాకు సాలీసాలని జీతాలాయే.. ఎల్లీఎల్లక ఏదో అంటమూ.. నిన్నుగాక ఎవలనంటమే.. పెండ్లాలనంటే లొల్లి అయితది కాదే..” అన్నాడు పెద్దకొడుకు.

“నేను మీకు లచ్చలు కోట్లు సంపాయించి ఇయ్యలేదు కొడుకులాలా..ఇచ్చినోల్లనే మెడలువట్టి నూకవట్టిరీ... నేను మీకు బుక్కెడు కూడుకు బరువైతున్న...నా సావుకే ఎదురుసూడ వడితిరి.. ఇగో వెంకటమ్మత్త బతుకత లేదా...నేను గిట్లనే బతుకుత.. కాల్లురెక్కలు ఆడినన్ని దినాలు ఈడ ఉంట..నాకు అత్త సోపతున్నది.. నేను కింద పడ్డనాడు మీరు కాకపోతే మంది అయితరా..నన్ను పారేసేది మీరే కదా బిడ్డా..ఈడనే నా పానం పోతది...జెర మీ అయ్యదాపుకే పెట్టుర్రి.” అంది బతుకమ్మ.

“నిన్ను నాయిన దాపుకే పెడుతంగని.. ఇంటికి పా..పోదాం..” అంటూ చిన్నకొడుకు చేయి పట్టుకున్నాడు.

“నేను రాను బిడ్డా..ఈడ మంచిగనే ఉన్నది. ఇన్నన్ని పండ్లు అమ్ముకుంటాన...పొద్దంత బడి పిల్లగాల్ల తోటి పొద్దుపోతాంది, శీకటైతే అత్తమ్మ తోటి ఎనుకటి ముచ్చట్లతోటి నిద్ర పడుతాంది.ఈ గోడ మీదికెల్లి సూత్తే మీ అయ్య బొంద కనపడుతాంది.ఆయన కండ్ల ముందట ఉన్నట్టుంది. “ అంది బతుకమ్మ.

“ నీ యవ్వా..ముచ్చట్లు బాగానే చెప్తానవు గనీ పా..” అన్నాడు పెద్దకొడుకు.

“ఓ..కొడుకా.. ఉండనియ్యిపో..నాకు సోపతి ఉంటది పోం..మీ అవ్వని నేను కంటికిరెప్పలెక్క సోసుకుంటా పో..మీకు బుద్ధిపుట్టినపుడల్ల రాండ్లి.. కాయో పండో పట్టుకోని రాండ్లి..” అంటూ వెంకటమ్మ నచ్చ చెప్పింది.

ఇద్దరూ వెళ్లిపోయారు.

“వదినే... కొడుకుల మనుసు తండ్లాడుతదీ

....మొగబాయిగాండ్లు ఊకే ఇల్లుపట్టుకోని ఉంటారూ...ఏందో శాత్రముండే సూడు.. కోటి వరాలు బోసినా కోడలు బిడ్డగాదూ.. అల్లుడు కొడుకు గాడూ.. అని..రేపు మంచంల పడితే

కోడలు బిడ్డ చేసినట్టు చేత్తదా..ఆషేది..కొడుకు తండ్రికి చేత్తడేమో...తల్లికి ఎట్ల చేత్తడు...కాల్లు రెక్కలు ఆడంగనే పోవాలే..” అంది బతుకమ్మ.

“అంతే వదినే..అనుకుంటం కని ఎట్ల రాసున్నదో..”

“మా పెద్దకొడుకు ఉండే కాడ ఒగ ముసలవ్వ మంచముల పడ్డది..బోడగుండు చేపిచ్చింన్లు..కోడలూ ఒగ తిట్టుడు గాదూ.. ఒగ గునిపిచ్చుడు గాదూ.. చెంపలు పిండుతదీ.. నెత్తి మీద మొట్టకాయలు ఎత్తది.. ఆ గోస ఎవలకు రావొద్దు వదినే... మనుసు ఒక్కషిత్తం చేసుకోవాలే.. ఏదన్న మింగి పానం దీసుకోవాలే..” అంది బతుకమ్మ.

రోజులు గడుస్తూనే ఉన్నాయి..సీజన్లో దొరికే

పండ్లు అమ్ముకుంటోంది.కొడుకులు పలుకరించి పోతూనే ఉన్నారు.

×××

“వెంకటమ్మ వదినే..నీ ధైర్నం ఉండుట్ల ఆరునెలల సంది ఇంత బ్యారం చేసుకున్న..ఇంత నీడ సూపిచ్చినవు..తోడబుట్టిన తోడోలే ఉన్నవూ..

ఎవలకు చెయ్యి చాపకుంట బతికినా.. ఒగ పదియేను వెయిల దాకా కూడినయి..సావు కరుసుకు మాగున్నయి...కొడుకులు కోడండ్లు నువ్వా నేనా అని తన్నుకునుడు ఉండది. బొందల గడ్డ సుతం దగ్గరనే ఉన్నది. మంచిదినం సూసుకోని ఎప్పుడు పానమిడిసినా రందిలేదు..నా బొడ్లె సంచిలనే పైసలున్నయి... మీ అన్న దాపుకే పెట్టుమని షెప్పు.. పుణ్యమునంటది వదినే..” అంది బతుకమ్మ.

“నీ పిచ్చి మొకంగాల...ఏ..ఊకో... ఉసిరిత్తోలే ఉన్నవూ... మనుమండ్ల పెండ్లి సూడవా... సచ్చినవుతీ..సామదొడ్లే పడి... ఏ..మల్లగిట్ల అనేవు...”

“అంతేంటవా వదినే..నీ నోటి వాక్యాన అయితే నీ నోట్లె షెక్కరి పొత్తగనీ.. సరేగనీ రేపు మా ఆడిబిడ్డ ఇంటిదాక పోయెత్త..జేరన్ని పండ్లున్నయి..నీ గంపల పోసుకో..పొద్దూకే వరకు వత్త” అంది.

తెల్లవారింది...వెంకటమ్మ బేరానికి వెళ్ళింది.

బతుకమ్మ స్మశానానికి వెళ్ళింది.నారాయణ ఖనన స్థలం మీది జిల్లేడు చెట్టూ పిచ్చి మొక్కలూ పెరికివేసింది, దుఃఖాన్ని ఆపుకోలేక పోయింది.దానిమీద ఒరిగి తలుచుకుంటూ ఏడుస్తూనే ఉంది.కొద్దీ నిమిషాల్లోనే ఆమె గొంతు మూగపోయింది.శరీరంలో చలనం శాశ్వతంగా ఆగిపోయింది.

# ప్రశ్నోత్తరాలు



నిర్వహణ : టి.ఎస్.ఎల్.ఎన్.మల్లేశ్వరరావు
ఐక్యఉపాధ్యాయ ప్రధాన సంపాదకులు
Mail ID : **ikyopadhyaya1975@gmail.com**

**ప్రశ్న** : డిఎస్‌సి 2002 ద్వారా డైరెక్ట్ స్కూల్ అసిస్టెంట్‌లుగా నియామకం పొందిన ఉపాధ్యాయులు 19.10.2002న విధులలో చేరారు. 01.11.2002న ప్రమోషన్ల ద్వారా ఎస్‌జిటి ఉపాధ్యాయులు స్కూల్ అసిస్టెంట్‌లుగా విధుల లో చేరారు. ఎవరు సీనియర్ అవుతారు?

**– గాడి వంశీచరణ్, దగదర్తి, నెల్లూరు**

**జవాబు : 2002 డిఎస్‌సి ద్వారా నేరుగా ఎస్‌ఏలుగా చేరిన ఉపా ధ్యాయులే సీనియర్‌లు అవుతారు.**

**ప్రశ్న** : ఒక ఉపాధ్యాయుడు ఒక సంవత్సరకాలం జీత నష్టపు సెలవులో వున్నారు. ఆ కాలానికి అర్ధజీతపు సెలవు జమ చేయవచ్చా?

**– పి.నరసింహారావు, కర్నూలు**

**జవాబు : ఆంధ్రప్రదేశ్ సెలవు నిబంధనలలోని రూల్ 13 (ఎ)లో** The half pay leave is admissible in respect of period spent on duty and on leave including extraordinary leave **అని పేర్కొనటం జరిగింది. దీని ప్రకారం ఆ జీత నష్టపు సెలవు కాలంలో కూడా అర్ధజీతపు సెలవు జమ చేయవలసి వుంటుంది.**

**ప్రశ్న** : నేను 30.06.2005న ఉద్యోగ విరమణ చేసాను. 15 సం॥ల తర్వాత కమ్యుటేషన్ చేసిన పెన్షన్ చెల్లించాలి కదా! కాని 01.10.2020 నుండి కమ్యుటేషన్ చేసిన పెన్షన్ చెల్లిస్తున్నారు. ఎందువలన?

**– పి.ఆశీర్వాదం, కడప**

**జవాబు : మొదటి పెన్షన్ తీసుకున్న రోజు నుండి 15 సం॥ల తర్వాత కమ్యుట్ చేసిన పెన్షన్ చెల్లిస్తారు. మీరు మొదటి పెన్షన్ ఏ తేదీ నుండి తీసుకున్నారో తెలపలేదు. మీరు ఆలస్యంగా పెన్షన్ తీసుకొనుట ప్రారంభించి వుండ వచ్చు.**

**ప్రశ్న** : మెడికల్ రీయింబర్స్‌మెంట్ పునరుద్ధరించబడే అవకాశం వుందా?

**– ఎస్.రామానుజరావు, రాజమండ్రి**

**జవాబు :** ఇ.హెచ్.ఎస్. కమిటీ సమావేశంలో మెడికల్ **రీయింబర్స్ మెంట్ పొడిగింపుకు ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపు తున్నట్లు తెలిపారు. ప్రభుత్వ నిర్ణయం రావలసివుంది.**

**ప్రశ్న** : ఒక మహిళా ఉపాధ్యాయిని 45 రోజులు హిస్టారెక్టమీ సెలవు తీసుకున్నారు. వారు సెలవుల అనంతరం విధులలో చేరాలంటే జిల్లా విద్యాశాఖాధికారి అనుమతి తీసుకోవాలా?

**– రాము, మున్నంగి**

**జవాబు :** అవసరం లేదు. **జిఓ నం.40 విద్య; తేదీ.07.05. 2002 ప్రకారం ప్రాథమిక పాఠశాలలో పనిచేస్తున్న ఉపాధ్యాయినికి మండల విద్యాశాఖాధికారి అనుమతి సరిపోతుంది.**

**ప్రశ్న** : 2002 సం॥లో పదవ తరగతి పరీక్షలు రాసిన ఒక విద్యార్థికి ఎస్ఎస్‌సి సర్టిఫికెట్‌లో పుట్టిన తేదీ తప్పుగా పడిందని, సరిచేయాలని దరఖాస్తు చేశారు. అవకాశం వుందా?

**– సిహెచ్.కోటేశ్వర్‌రావు, ప్రకాశం జిల్లా**

**జవాబు :** లేదు. జిఓ ఎంఎస్ నం.430 విద్య; **తేదీ.31.12.1992 ప్రకారం, ఎస్ఎస్‌సి పూర్తి అయిన 3 సం॥ల వరకు మాత్రమే తప్పుగా నమోదైన పుట్టిన తేదీని సవరించుకొనే అవకాశం వుంది.**

**ప్రశ్న** : ఆదాయపు పన్ను ఇ–ఫైలింగ్ చేసిన తర్వాత రావలసిన మొత్తానికి వడ్డీతో కలిపి రీఫండ్ వచ్చింది. వడ్డీని ఆదాయంలో చూపాలంటున్నారు. వాస్తమేనా?

**– హుస్సేన్, శ్రీకాకుళం**

**జవాబు : అవును. ఆదాయపు పన్ను శాఖ నుండి రీఫండ్ వచ్చిన మొత్తంలో వడ్డీని వచ్చే సంవత్సరం ఆదాయంలో చూప వలసి వుంటుంది.**

**ప్రశ్న** : పిఎఫ్ ఋణం కోసం దరఖాస్తు చేసి రెండు నెలలు అయినా ఋణం అందటం లేదు. ఎందువలన?

**– బి.విశ్వప్రసాద్, అమలాపురం**

**జవాబు : పిఎఫ్ ఋణం మంజూరైన మొత్తాన్ని బిల్లుగా జిల్లా పరిషత్ వారు సిఎఫ్ఎంఎస్‌లో క్లయిమ్ చేయడం జరు గుతుంది. ప్రభుత్వం బడ్జెట్ రిలీజ్ చేయకపోవటం వలన సొమ్ము జమకావడంలో జాప్యం జరుగుతోంది.**

# కృష్ణా-గుంటూరు జిల్లాల ఉపాధ్యాయ నియోజకవర్గం నుండి యుటియఫ్ బలపర్చిన పిడిఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థిగా బొడ్డు నాగేశ్వర రావు

2021 మార్చి నెలలో కృష్ణా-గుంటూరు జిల్లాల ఉపాధ్యాయ శాసనమండలి నియోజక వర్గానికి జరగనున్న ఎన్నికలలో యుటియఫ్ మరియు సోదర ఉపాధ్యాయ అధ్యాపక సంఘాలు బలపరచిన పిడిఎఫ్ అభ్యర్థిగా పోటీ చేయుచున్నారు.

**విద్యాభ్యాసం**

**ప్రాథమిక విద్య :** పిఎస్ ఎలిమెంటరీ స్కూల్, ఆత్కూరు, ఉంగుటూరు (మం), కృష్ణా జిల్లా.

**పాఠశాల విద్య :** జిల్లా పరిషత్ హైస్కూల్, ఆత్కూరు, ఉంగుటూరు (మం), కృష్ణా జిల్లా.

**ఇంటర్ విద్య :** వి.కె.ఆర్. కళాశాల, బుద్దవరం, గన్నవరం (మం), కృష్ణా జిల్లా.

**బిఏ :** ఆంధ్రా యూనివర్శిటీ నుండి బిఏ పూర్తి చేశారు.

**టిటిసి :** ప్రభుత్వ ఉపాధ్యాయ శిక్షణ సంస్థ, ఏలూరు.

**బిఇడి :** గవర్నమెంట్ కాంప్రహెన్సివ్ కాలేజ్ ఆఫ్ ఎడ్యుకేషన్, నెల్లూరు.

సెకండరీ గ్రేడ్ ప్రధానోపాధ్యాయునిగా 19.02.1979 నుండి 17 సం॥లు ప్రాథమిక పాఠశాలల్లోనూ, ది.13.11.1996 నుండి స్కూల్ అసిస్టెంట్ (సోషల్)గా 16 సం॥లు పైగా యుపి స్కూల్స్‌లో ప్రధానోపాధ్యాయునిగాను మరియు జడ్‌పిహెచ్ స్కూల్, రామవరప్పాడులో స్కూల్ అసిస్టెంట్ (సోషల్)గాను పని చేశారు. 33 సం॥ల కాలంలో వివిధ పాఠశాలల్లో దాతల సహకారంతో మౌలిక వసతుల కల్పన, విద్యార్థులకు నగదు ప్రోత్సాహక బహుమతులు అందించడం, ఉపాధ్యాయుల సహకారంతో విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించడం.

**1980 నుండి ఉపాధ్యాయ ఉద్యమంలో సమితి, మండల స్థాయిల్లో, 1995 నుండి జిల్లా ప్రధానకార్యదర్శిగా, 2005 నుండి యుటియఫ్ రాష్ట్ర కార్యదర్శిగాను బాధ్యతలు నిర్వహించారు.**

2007 నుండి 2013 వరకు యుటియఫ్ రాష్ట్ర కార్యాలయం విజయవాడలో కుటుంబంతో సహా నివాసం వుండి ఇతర బాధ్యతలతో పాటు కార్యాలయ నిర్వహణ మరియు ప్రచురణలు బాధ్యతలు కూడా నిర్వహించారు.

**ఉద్యోగ, ఉపాధ్యాయ, అధ్యాపక, కార్మిక, పెన్షనర్ల ఐక్య కార్యాచరణ సమితి (జెఏసి) పశ్చిమ కృష్ణా కో-చైర్మన్‌గా 5 సం॥లు పైగా పనిచేసి, వివిధ సమస్యలపై జరిగిన ఆందోళనలు, పోరాటాల్లో పాల్గొని విశాల ఐక్య ఉద్యమాలు నిర్మించడంలో ముందున్నారు.**

**జాతీయ అక్షరాస్యతా ఉద్యమంలో భాగంగా గన్నవరం మండలంలోని సావరగూడెం, జక్కులనెక్కలం గ్రామాలను సంపూర్ణ అక్షరాస్యతా గ్రామాలుగా అందరి సహకారంతో తీర్చిదిద్దారు.**

**ప్రజలలో శాస్త్ర విజ్ఞానాన్ని పెంపొందించే లక్ష్యంతో ఉద్యమిస్తున్న జనవిజ్ఞాన వేదికలో ప్రత్యక్షంగానూ, పరోక్షంగానూ పాల్గొని సహకారం అందించారు.**

**శాసనమండలి సభ్యునిగా**

2013లో కృష్ణా- గుంటూరు పట్టభద్రుల నియోజక వర్గం నుండి శాసనమండలి సభ్యునిగా ఎన్నికయ్యారు. వీరు ఎమ్మెల్సీగా పనిచేసిన కాలంలో ఉపాధ్యాయులు చేసిన అన్ని పోరాటాలకు మద్దతుగా నిలిచారు.

ఎమ్మెల్సీగా పనిచేసిన ఆరేళ్ళ కాలంలో నిరుద్యోగులు, ఉపాధ్యాయులు, అధ్యాపకులు, కార్మిక, కర్షకుల పోరాటాలన్నిటికి మద్దతుగా నిలిచారు. ఆయా వర్గాల సమస్యలను ప్రాతినిధ్యం చేయడం లోనూ, శాసనమండలిలో చర్చించడంలో నూ చొరవ చూపారు. **ఈ కాలంలో ప్రశ్నలు, స్పెషల్ మెన్షన్ లు, వాయిదా తీర్మానాలు, షార్ట్ నోటీసులు, రూల్ 70 మరియు షార్ట్ డిస్కషన్స్ ద్వారా శాసన మండలిలో అత్యధిక సమస్యలు లేవనెత్తిన ఎమ్మెల్సీగా రికార్డుకెక్కారు.**



ముఖ్యంగా ఉపాధ్యాయ, అధ్యాపక, కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ వారి సమస్యల పరిష్కారానికి శాసనమండలిలో ఎమ్మెల్సీలతో ఏర్పాటు చేసిన కమిటీలో సభ్యునిగా కీలకపాత్ర పోషించి, ఉపాధ్యాయ, అధ్యాపక సమస్యల పరిష్కారానికి విలువైన సూచనలు చేసి కొన్ని సమస్యల పరిష్కారానికి దోహదపడ్డారు. ఉపాధ్యాయులను బోధనేతర పనులు నుండి మినహాయించి బోధనకే పరిమితం చేయాలని వేసిన ప్రశ్న శాసనమండలిలో పెద్ద చర్చనీయాంశమై చివరకు విద్యామంత్రి ఇచ్చిన హామీ మేరకు ఎమ్మెల్సీలతో, ఉపాధ్యాయ సంఘాలతో సమావేశం ఏర్పాటు చేశారు.

ప్రైవేట్ టీచర్లు, అధ్యాపకులు ఎదుర్కొంటున్న సమస్యలపై ఒక ప్రశ్న ద్వారా శాసనమండలిలో పెద్ద ఎత్తున చర్చ లేవదీశారు. మంత్రి ఇచ్చిన హామీలు నెరవేరాలి.

చిన్న బడ్జెట్ ప్రైవేట్ స్కూళ్లు ఎదుర్కొంటున్న సమస్యలను చర్చించటమే కాకుండా కార్పొరేట్ విద్యా సంస్థల దోపిడీని అక్కడ విద్యార్థుల ఆత్మహత్యలపై నిలదీయడం జరిగింది.

సమాజంలో ప్రజలెదుర్కొంటున్న సమస్యలతో పాటు వివిధ రంగాలలో ఉద్యోగులు, కార్మికులు ఎదుర్కొంటున్న అనేక సమస్యలపై జరిగిన పోరాటాలలో పాల్గొంటూనే సమస్యలను శాసనమండలి దృష్టికి తెచ్చారు.

ప్రజా ఉద్యమాలలో పనిచేయుచున్న కార్యకర్తలు, వారి కుటుంబ సభ్యులు మరియు అతి పేద కుటుంబాలలోని వారికి అనారోగ్యం సంభవించినప్పుడు వైద్య ఖర్చుల నిమిత్తం సుమారు **60 లక్షలపైగా సిఎం రిలీఫ్ ఫండ్ మంజూరు చేయించి ఆదుకొన్నారు.**

పిడిఎఫ్ ఎమ్మెల్సీల ఫోరంలో డెప్యూటీ ఫ్లోర్ లీడర్‌గా పనిచేశారు. పిడిఎఫ్ ఎమ్మెల్సీలు అందరు కలిసికట్టుగా పనిచేసి వివిధ యాజమాన్యాలలో రెగ్యులర్ మరియు కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్‌లో పనిచేయుచున్న ఉపాధ్యాయ, అధ్యాపకులతోపాటు ఎస్ఎస్ఏలో పనిచేయుచున్న సుమారు 25వేలమంది కాంట్రాక్ట్ ఉద్యోగుల వేతనాల పెరుగుదలకు జూనియర్ డిగ్రీ, పాలిటెక్నిక్, ఎయిడెడ్ కళాశాలలు, యూనివర్శిటీలు, కెజిబివి స్కూల్స్, మోడల్ స్కూల్స్, గురుకులాలు, ఎయిడెడ్ పాఠశాలల్లో పనిచేయుచున్న వారి సమస్యల పరిష్కారంలో చొరవచూపారు.

నీతిగా, నిజాయితీగా విలువలతో చట్టసభల గౌరవాన్ని కాపాడుతూ, ప్రజలకు అందుబాటులో వుంటూ ప్రజా ఉద్యమాలన్నిటికి బాసటగా నిలిచారు. విజ్ఞులైన ఉపాధ్యాయ, అధ్యాపక, సోదర సోదరీ మణులంతా నిశితంగా పరిశీలించి **మీ ప్రథమ ప్రాధాన్యత (1) ఓటు వేసి బొడ్డు నాగేశ్వరరావుకి** విజయం చేకూర్చాలని విజ్ఞప్తి చేస్తున్నాము.

# ఉభయ గోదావరి జిల్లాల ఉపాధ్యాయ నియోజకవర్గం నుండి యుటియఫ్ బలపర్చిన పిడిఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థిగా షేక్ సాబ్జీ

2021 మార్చి నెలలో జరగనున్న ఉభయగోదావరి జిల్లాల ఉపాధ్యాయ శాసనమండలి నియోజక వర్గానికి జరగనున్న ఎన్నికలలో యుటియఫ్ మరియు సోదర ఉపాధ్యాయ అధ్యాపక సంఘాలు బలపరచిన పిడిఎఫ్ అభ్యర్థిగా యుటియఫ్ రాష్ట్ర అధ్యక్షులు **షేక్ సాబ్జీ** పోటీ చేయుచున్నారు.

**విద్యాభ్యాసం**

ప్రాథమిక విద్యాభ్యాసం ప్రాథమిక పాఠశాల గూటాల, దేవరపల్లి మండలం ధుమంతునిగూడెం నందు 6 నుండి 10వ తరగతి వరకు దేవరపల్లి జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాల, ఇంటర్మీడియేట్ విద్యాభ్యాసం తాడేపల్లిగూడెం డిఆర్ గోయంకా కళాశాల, బి.ఎస్.సీ డిగ్రీ రాజమండ్రి ఆర్ట్స్ కళాశాల నందు, టిటిసి ఏలూరు ప్రభుత్వ ఉపాధ్యాయ శిక్షణా సంస్థ, బి.ఇడి శ్రీ వెంకటేశ్వర విశ్వవిద్యాలయం నుండి దూరవిద్య ద్వారా విద్యనభ్యసించారు.

**ఉపాధ్యాయ వృత్తి పరిచయం**

1989 డిఎస్‌సి ద్వారా ఎంపికై ది.02.08.1989వ తేదీన చాగల్లు మండలం ఊనగట్ల ప్రాథమిక పాఠశాలలో స్పెషల్ టీచర్‌గా విధులలో చేరారు. 24.09.1989 నుండి రెగ్యులర్ సెకండరీ గ్రేడ్ ఉపాధ్యాయుడిగాను, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల మాదేపల్లిలో స్కూల్ అసిస్టెంట్ (పిఎస్)గా నేటివరకు పని చేయుచున్నారు.

**ఉద్యమ నేపథ్యం**

1990లో ఆంధ్రప్రదేశ్ ఐక్యఉపాధ్యాయ ఫెడరేషన్ (యుటియఫ్)లో ప్రాథమిక సభ్యునిగా చేరి 1990 నుండి 2017 వరకు మండల కార్యవర్గ సభ్యునిగా, మండల శాఖ ప్రధానకార్యదర్శిగాను, జిల్లా కార్యదర్శిగా, జిల్లా అధ్యక్షునిగా, జిల్లా శాఖ ప్రధానకార్యదర్శిగాను, రాష్ట్ర కార్యదర్శి, రాష్ట్ర గౌరవాధ్యక్షునిగాను పనిచేశారు. 2017 డిసెంబర్ 11న శ్రీకాకుళంలో జరిగిన 15వ రాష్ట్ర మహాసభలలో రాష్ట్ర అధ్యక్షునిగా ఎన్నికై నేటివరకు రాష్ట్ర అధ్యక్షుని బాధ్యతలలో ఉన్నారు. స్కూల్ టీచర్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా (ఎస్‌టిఎఫ్ఐ) జాతీయ ఉపాధ్యక్షునిగా కొనసాగుతున్నారు.

పశ్చిమగోదావరి జిల్లా జెఏసి కన్వీనర్‌గా, యుఎస్‌పిఎస్ జిల్లా కన్వీనర్‌గాను, జాక్టో స్టీరింగ్ కమిటీ సభ్యునిగాను వ్యవహరించి పలు పోరాటాలకు నాయకత్వం వహించారు. ప్రస్తుతం ఫ్యాప్టో కో-చైర్మన్‌గాను, జెఏసి కార్యవర్గ సభ్యునిగాను పనిచేస్తున్నారు.

**పోరాటాల నేపథ్యం**

1990 నుండి ఉపాధ్యాయ సమస్యలపై జరిగిన అన్ని స్థాయిల పోరాటాలలో చురుకుగా పాల్గొన్నారు. పలు పర్యాయాలు అరెస్ట్ కాబడడం జరిగింది. అప్రెంటీస్ వ్యవస్థ రద్దు మరియు అప్రెంటీస్ సర్వీస్ నోషనల్ ఇంక్రిమెంట్ల సాధన కోసం 14 సం॥ల కాలంలో జరిగిన ధర్నాలు, పికెటింగ్‌లు, నిరాహారదీక్షలు, సమ్మెలోను పాల్గొన్నారు.

ఎయిడెడ్ ఉపాధ్యాయుల సమస్యలు, ఎయిడెడ్ కళాశాలల్లో పోస్టుల భర్తీ నిలిపివేత జిఒ 35 రద్దు కోసం జరిగిన పలు పోరాటాల్లో ఆక్టాతో కలిసి పాల్గొన్నారు.

పంచాయితీరాజ్ ఉపాధ్యాయులు, మున్సిపల్ ఉపాధ్యాయుల జీతాల చెల్లింపులు 010 హెడ్ ద్వారా సాధించడంలో జరిగిన పలు ఉద్యమాల్లో పాల్గొన్నారు.



కాంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీమ్ (సిపిఎస్) రద్దు కోసం 16 సం॥లుగా మండల, జిల్లా, రాష్ట్ర, జాతీయ స్థాయిలో జరిగిన ధర్నాలు, నిరాహారదీక్షలు, ర్యాలీలు, పికెటింగ్‌లు, జాతాలు, పాదయాత్రలు వంటి పలు పోరాటాల్లో 100కు పైగా ఉద్యమాల్లో ప్రత్యక్షంగా పాల్గొన్నారు.

2008 అక్టోబర్ 22 నుండి నవంబర్ 3వరకు జరిగిన జాయింట్ యాక్షన్ కమిటీ ఆఫ్ టీచర్ ఆర్గనైజేషన్ పిలుపుమేరకు జరిగిన 13 రోజుల సమ్మెకు పశ్చిమగోదావరి జిల్లాలో నాయకత్వం వహించారు. సమ్మె కాలంలో 30 గంటలు నిరవధిక నిరాహారదీక్షలో పాల్గొన్నారు.

పశ్చిమగోదావరి జిల్లా కలెక్టర్‌గా కాటమనేని భాస్కర్ పనిచేసిన కాలంలో ఉపాధ్యాయులను అవమానించిన సంఘటనలలో ఉపాధ్యాయ సంఘాలను కలుపుకుని పలు ఉద్యమాలు నిర్వహించి విజయం సాధించటంలో కీలకపాత్ర పోషించారు.

2018 జులై 30 నుండి ఆగష్టు 11 వరకు ఇచ్ఛాపురం నుండి విజయవాడవరకు ఫ్యాప్టో ఆధ్వర్యంలో జరిగిన జాతాకు నాయకత్వం వహించి 5 జిల్లాల్లోని అనేక మండలాలగుండా 2700 కి.మీ.లు మోటారు సైకిల్ పై ప్రయాణించి 100కిపైగా మండల కేంద్రాలలో జరిగిన బహిరంగ సభల్లో ఉపన్యసించి ఉపాధ్యాయుల్లో ఉద్యమ చైతన్యం కలిగించారు.

2019 ఫిబ్రవరి 3,4,5 తేదీలలో సిపిఎస్ రద్దు కోరుతూ యుటియఫ్ ఆధ్వర్యంలో ఏలూరు నుండి విజయవాడ వరకు జరిగిన 66 కిలోమీటర్ల పాదయాత్రకు నాయకత్వం వహించారు. సిపిఎస్ రద్దుకోసం జాతీయ స్థాయిలో జరిగిన సమ్మెలలోను, పార్లమెంట్ ఎదుట జరిగిన ధర్నాలలో పలు పర్యాయాలు పాల్గొన్నారు. పోరాటాల నేపథ్యంలో పలుసార్లు కోర్టు కేసులను ఎదుర్కొన్నారు.

సామాజిక స్పృహతో ఆయన పనిచేస్తున్న మాదేపల్లి పాఠశాలనందు విద్యానభ్యసించిన అనేకమంది పేద విద్యార్థుల ఉన్నత విద్యాభ్యాసానికి కావలసిన ఆర్థిక సహకారాన్ని అందించారు.

ఇంకా 5 సం॥లు సర్వీస్ ఉన్నప్పటికి ఉపాధ్యాయుల, అధ్యాపకుల సమస్యల పరిష్కారం కోసం, ప్రభుత్వ విద్యారంగం పరిరక్షణ, విద్యార్థుల ప్రయోజనాల కోసం చట్టసభల వేదికగా బలమైన గళం విన్పించేదానికి కోసం, ప్రభుత్వానికి ప్రశ్నించేదాని కోసం, ఉపాధ్యాయ, అధ్యాపకులకు అండగా వుండడం ద్వారా విశాల ఐక్యతకు దోహదపడాలనే ఉద్దేశ్యంతో సంఘం పిలుపుమేరకు మిగిలిన సర్వీస్‌ను వదులుకొని స్వచ్ఛంద పదవీ విరమణ చేసి ఈ ఎన్నికల్లో పోటీ చేస్తున్నారు. విజ్ఞులైన ఉపాధ్యాయ, అధ్యాపక, సోదర సోదరీ మణులంతా నిశితంగా పరిశీలించి మీ ప్రథమ ప్రాధాన్యత (1) ఓటు వేసి షేక్ సాబ్జీకి విజయం చేకూర్చాలని విజ్ఞప్తి చేస్తున్నాము.

ఉద్యమవార్తలు

# నిరసన కార్యక్రమాలు

## శ్రీకాకుళం

### వ్యవసాయ వ్యతిరేక చట్టాలను రద్దు చేయాలి

కేంద్ర ప్రభుత్వం రూపొందించిన వ్యవసాయ వ్యతిరేక చట్టాలను రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ రైతు సంఘాల ఆధ్వర్యంలో జరిగిన భారత్‌బంద్‌లో యుటియఫ్ సంఘీభావంగా పాల్గొని రైతులకు మద్ధతు తెలియజేసింది.

ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు పొందూరు అప్పారావు, రాష్ట్ర ఆడిట్ సభ్యులు ఎస్.కిషోర్‌కుమార్, జిల్లా కార్యదర్శి యండ ఉమాశంకర్, రైతు సంఘం జిల్లా కార్యదర్శి కె.మోహనరావు, మాజీ ఎమ్మెల్యే బొడ్డేపల్లి సత్యవతి, సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు డి. గోవిందరావు, గిరిజన సంఘం జిల్లా నాయకులు ఎం. తిరుపతిరావు, సిఐటియు జిల్లా నాయకులు పి.తేజేశ్వరరావు, టి.తిరుపతి రావు, కె.నాగమణి, పలు సంఘాల నాయకులు ఆదినారాయణ మూర్తి, సోమశేఖర్, సూరయ్య, అల్లు సత్యం, అప్పలనాయుడు, టి.చలపతి రావు, జె.వి.వి.నాయకులు కె.అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

## పశ్చిమగోదావరి

### వెబ్ కౌన్సిలింగ్ రద్దు చేయాలి, పోస్టుల బ్లాకింగ్ తొలగించాలి

**కాళ్ళ :** కాళ్ళ మండల వనరుల కేంద్రం వద్ద ఫ్యాప్టో కాళ్ళ శాఖ నిరసన ప్రదర్శన చేపట్టడం జరిగింది. వెబ్‌కౌన్సిలింగ్ రద్దుచేసి, మాన్యువల్ కౌన్సిలింగ్ చేపట్టాలని డిమాండ్ చేయడం జరిగింది. బదిలీల్లో అన్ని ఖాళీలను చూపించాలని డిమాండ్ చేశారు. ఉపాధ్యాయులు నిరసన నిర్వహించి తదనంతరం ఎంఇఓకి వినతి పత్రం అందించడమైనది.

ఈ కార్యక్రమంలో యుటియఫ్ జిల్లా కార్యదర్శి సిహెచ్.పట్టాభి రామయ్య, సీనియర్ నాయకులు, కె.ఎస్.ఎన్., పి.ఎస్.ఆర్. అధ్యక్షులు జి.ఆర్.కె.రాజు, కోశాధికారి ఎం.శంకర్రావు, ఫ్యాప్టో నాయకులు కోశాధికారి వి.జనార్ధన్, అధ్యక్షులు వి.గణేష్, ప్రధాన కార్యదర్శి సిహెచ్.మోహన్‌బాబు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## గుంటూరు

### రైతులకు మద్ధతుగా భారత్ బంద్‌కు సంపూర్ణ మద్ధతు

రైతులకు నష్టం కలిగించే నల్ల చట్టాలని రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ జరిగిన భారత్ బంద్‌కు యుటియఫ్ సంపూర్ణ మద్ధతు ప్రకటించింది. ఈ సందర్భంగా వివిధ కార్మిక సంఘాలు, ప్రజా సంఘాలు నిర్వహించిన ర్యాలీలో యుటియఫ్ నాయకులు పాల్గొని నూతన వ్యవసాయ చట్టాలను రద్దు చేయాలని, రైతులకు గిట్టుబాటు ధర కల్పించాలని, దేశానికి అన్నంపెట్టే రైతును రోడ్డున పడేయడం దుర్మార్గమని, కార్పొరేట్‌లకు దేశాన్ని తాకట్టుపెట్టే విధానాలను అనుసరించవద్దని నినాదాలు చేశారు.

ఈ ర్యాలీలో జిల్లా అధ్యక్ష, ప్రధానకార్యదర్శులు పి.ప్రేమ్‌కుమార్, కె.నాగమల్లేశ్వరరావు, రాష్ట్ర సహాధ్యక్షులు ఎన్.వెంకటేశ్వర్లు, జిల్లా కోశాధికారి ఎం.కళాధర్, జిల్లా కార్యదర్శి జి.వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

## ప్రకాశం

### భారత్ బంద్‌కు మద్ధతు

కేంద్ర ప్రభుత్వ తీసుకు వచ్చిన 3 వ్యవసాయ చట్టాలను నిరసిస్తూ దేశ వ్యాప్తంగా జరుగుతున్న భారత్ బంద్ లో భాగంగా యు.టి.యఫ్ ప్రకాశం జిల్లా శాఖ ఆధ్వర్యంలో ఒంగోలులో ప్రకాశం భవనం ఎదుట బంద్ చేయడం జరిగింది.

ఈ కార్యక్రమంలో రాష్ట్ర కోశాధికారి కె.శ్రీనివాసరావు, జిల్లా అధ్యక్షులు యస్.రవి, కోశాధికారి కె.లక్ష్మినారాయణ, కార్యదర్శి యన్.చిన్నస్వామి పాల్గొనడం జరిగింది. త్రిపురాంతకం, కనిగిరి, బి.పేట, కంభం, అర్ధవీడు, అద్దంకి, దర్శి, గుడ్లూరు, పొదిలి, మర్రిపూడి, కె.కె.మిట్ల, మార్కాపురం, యస్.కొండ, గిద్దలూరు మండలాలలో యు.టి.యఫ్ నాయకులు, కార్యకర్తలు మద్దతు తెలియజేయడం జరిగింది.

## కడప

### వ్యవసాయాన్ని కార్పొరేటీకరించవద్దు

వ్యవసాయాన్ని కార్పొరేటర్ల చేతిలో పెట్టవద్దని, కనీస మద్ధతుకు గ్యారెంటీ ఇవ్వాలనే డిమాండ్లతో ఢిల్లీలో రైతులు చేస్తున్న ఉద్యమానికి యుటియఫ్ సంఘీభావం తెలుపుతున్నట్లు యుటియఫ్ రాష్ట్ర కార్యదర్శి బి.లక్ష్మీరాజ చెప్పారు. డిసెంబర్ 22న రైతులకు నష్టం కలిగించే చట్టాలకు వ్యతిరేకంగా నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా లక్ష్మీరాజ మాట్లాడుతూ మనకు అన్నంపెట్టే అన్నదాతలను ఇబ్బందిపెట్టే విధంగా కేంద్ర ప్రభుత్వం చట్టాలు చేయడం అన్యాయమన్నారు.

ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శులు రామాంజనేయులు, దావుద్దీన్, నరసింహారావు, నాయకులు నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

### ఉపాధ్యాయ బదిలీలను మాన్యువల్ కౌన్సిలింగ్ పద్ధతిలో నిర్వహించాలి

ప్రభుత్వ ఉపాధ్యాయుల బదిలీలను వెబ్ కౌన్సిలింగ్ ద్వారా కాకుండా మాన్యువల్ కౌన్సిలింగ్‌లో పద్ధతిలో నిర్వహించాలని, అలాగే బదిలీల్లో ఖాళీలన్నీ చూపాలని, బ్లాక్ చేసిన ఖాళీలన్నీ ఓపెన్ చేయాలని, చైల్డ్ ఇన్‌ఫోలో మాధ్యమం మార్పువలన కోల్పోయిన పోస్టులను పునరుద్ధరించాలంటూ పిడిఎఫ్ మరియు స్వతంత్ర ఎమ్మెల్సీలు చేపట్టిన నిరహారదీక్షకు కడప మండల విద్యా వనరుల కేంద్రం వద్ద జరిగిన నిరసన కార్యక్రమంలో ఫ్యాప్టో నాయకులు ఎక్కువ సంఖ్యలో హాజరై ఎంఇఓ నాయకులకు వినతి పత్రం ఇవ్వడం జరిగింది.

ఈ కార్యక్రమంలో ఫ్యాప్టో నాయకులు సుబ్రహ్మణ్యం రాజు, మహేష్‌బాబు, ఇలియాస్ భాష, దావుద్దీన్, నరసింహారావు, మహబూబ్ భాష, బాబు, మస్తాన్‌వలి, నాగరాజు, దేవదత్తం తదితరులు పాల్గొన్నారు.

ఉద్యమవార్తలు

# డిఇఓ కార్యాలయాల ముట్టడి

**శ్రీకాకుళం**

## మాన్యువల్ కౌన్సిలింగ్ నిర్వహించాలి

ఉపాధ్యాయుల బదిలీలలో ప్రభుత్వం కక్షపూరితంగా వ్యవహరిస్తోందని, హామీలు ఇచ్చిన అంశాలు కూడా ఉత్తర్వులు ఇవ్వలేదని, బదిలీలలో ఉపాధ్యాయ ఖాళీలను బ్లాక్ చేయరాదని, మాన్యువల్ కౌన్సిలింగ్ నిర్వహించాలని జిల్లా విద్యాశాఖాధికారి కార్యాలయం ముట్టడి నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర ఫ్యాప్టో కో-చైర్మన్ కొప్పల భానుమూర్తి మాట్లాడుతూ ఉపాధ్యాయుల బదిలీలు ప్రహసనంగా మారాయని అన్నారు. రాష్ట్రస్థాయి విద్యాశాధికారులు ఉపాధ్యాయుల పట్ల కక్షపూరితంగా వ్యవహరిస్తున్నారని, ఇంతకు ముందు ఎన్నడూలేని విధంగా బదిలీల నిబంధనలు ఉపాధ్యాయులను ఆందోళనకు గురి చేస్తున్నాయని అన్నారు.

యుటియఫ్ రాష్ట్ర కార్యదర్శి గొంటి గిరిధర్ మాట్లాడుతూ రాష్ట్ర స్థాయి విద్యాశాఖాధికారులకు బదిలీల విషయమై ఎన్నిసార్లు విజ్ఞప్తులు చేసినా పట్టించుకోవడం లేదని, హామీలు ఇచ్చిన విషయాలకు కూడా ఉత్తర్వులు జారీ చేయడం లేదని, జిల్లాలో పాఠశాలల కేటగిరీలకు సంబంధించి, బదిలీలలో ఉపాధ్యాయుల పాయింట్లకు సంబంధించి అనేక పొరపాట్లు చేస్తున్నారని ఇవన్నీ సరిచేసి పారదర్శకంగా మాన్యువల్ కౌన్సిలింగ్‌లో బదిలీలు నిర్వహించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ అధికారుల దుర్మార్గ విధానాలను ఎండగట్టాలని పిలుపునిచ్చారు. జిల్లా ఫ్యాప్టో చైర్మన్ పేడాడ ప్రభాకర్, ఫ్యాప్టో సెక్రటరీ బల్ల సుభాష్ బాబు, మజ్జి మదన్మోహన్, ధవళ సరస్వతి, యుటియఫ్ జిల్లా అధ్యక్షులు పొందూరు అప్పారావు, జనరల్ సెక్రటరీ రెడ్డి మోహనరావు, ఫ్యాప్టో నాయకులు టెంక చలపతిరావు, కొమ్ము అప్పలరాజు, ఆలికాన చెంచునాయుడు, కోత ధర్మారావు, యుటియఫ్ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు చౌదరి రవీంద్ర, గురుబెల్లి రమణ, ఫ్యాప్టో నాయకులు శ్రీరామమూర్తి, బాలాజీ, ధనుంజయ రావు, క్రాంతి కుమార్, యండ ఉమాశంకర్, అన్నాజీరావు, తాతావు, ఆర్.లక్ష్ము నాయుడు, డి.పెంటయ్య, శ్రీనివాసరావు, బి.రవికుమార్, కిషోర్, ఎన్.వాగ్దేవి, ఏ సాంబమూర్తి, గురుగుబెల్లి గోపాలరావు, ప్రధానోపాధ్యాయుల సంఘం ప్రధానకార్యదర్శి దాలినాయుడు పాల్గొని ప్రసంగించారు.

**విజయనగరం**

## కలెక్టరేట్ వద్ద ఉద్రిక్తత... వేలాదిమంది టీచర్ల ధర్నా

మాన్యువల్ పద్ధతిలో టీచర్స్ కౌన్సిలింగ్ నిర్వహించాలని, పోస్టుల బ్లాకింగ్ ఎత్తివేయాలని కోరుతూ ఫ్యాప్టో ఆధ్వర్యంలో ఉపాధ్యాయులు జిల్లా కలెక్టరేట్‌కు చేరుకకుని పెద్దఎత్తున నినాదాలు చేశారు. ముట్టడి చేస్తున్నా అధికారులు స్పందించకపోవడంతో డిఇఓ కార్యాలయానికి వెళ్లేందుకు ఉపాధ్యాయులు ప్రయత్నించారు. దీంతో పోలీసులు వారిని అడ్డుకున్నారు. ఈ క్రమంలో ఇరువర్గాలు మధ్య తోపులాట చోటు చేసుకుంది. 2వ పట్టణ సిఐ శ్రీనివాసరావు ఉపాధ్యాయులు రౌడీల్లా ప్రవర్తిస్తున్నారని అనడంతో ఉపాధ్యాయులు ఆగ్రహించారు. అడ్డంగా పెట్టిన బారికేడ్లను తొలగించి లోపలికి వెళ్లేందుకు ప్రయత్నించారు. వెబ్ కౌన్సిలింగ్ రద్దు చేయాలని, మాన్యువల్ పద్ధతిలోనే బదిలీలు చేపట్టాలని, బ్లాక్ చేసిన ఉపాధ్యాయుల ఖాళీలను బయటపెట్టాలని, ఉపాధ్యాయ సమస్యలు పరిష్కరించాలని పెద్దఎత్తున నినదించారు. దీంతో పోలీసులు డిఇఓ నాగమణికి సమాచారమివ్వడంతో ఆమె ముట్టడి వద్దకు చేరుకున్నారు. ప్రభుత్వం దృష్టికి ఉపాధ్యాయుల డిమాండ్లు తీసుకెళతామని, ఉపాధ్యాయులకు అన్యాయం జరగకుండా చూస్తామని హామీ ఇచ్చారు.

ఈ కార్యక్రమంలో ఫ్యాప్టో నాయకులు జోగరావు, భూకరిబాబు, శేషగిరి, రాము, విజయగౌరి, డి. ఈశ్వరరావు, ఎస్.మురళీమోహన్ రావు, జెఏవిఆర్‌కె ఈశ్వరరావు, బి.వజయకుమార్, సిహెచ్. భాస్కర్, జి.పార్వతిలు పాల్గొన్నారు.

**తూర్పుగోదావరి**

## డిఇఓ ఆఫీసును ముట్టడించిన ఉపాధ్యాయులు

ఉపాధ్యాయుల సాధారణ బదిలీలను మాన్యువల్ కౌన్సిలింగ్ పద్ధతిలో జరపాలని, ఏ ఒక్క ఉపాధ్యాయ ఖాళీని బ్లాక్ చేయకూడదని డిమాండ్ల సాధనకై ఫ్యాప్టో రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు డిసెంబర్ 10న ఉపాధ్యాయులు, తూర్పుగోదావరి జిల్లా విద్యాశాఖాధికారి వారి కార్యాలయాన్ని ముట్టడించారు. ఫ్యాప్టో జిల్లా చైర్మన్ కె.సుబ్రహ్మణ్యం పికెటింగ్‌కు అధ్యక్షత వహించారు. జెఏసి జిల్లా కన్వీనర్ మరియు యుటియఫ్ రాష్ట్ర ఆడిట్ కమిటీ కన్వీనర్ డి.వి. రాఘవులు ఉపాధ్యాయులను ఉద్దేశించి మాట్లాడుతూ వ్యవసాయక బిల్లులకు వ్యతిరేకంగా ఢిల్లీ సరిహద్దులో చేస్తున్న రైతుల పోరాట స్ఫూర్తితో సమస్యల సాధనకై ఉపాధ్యాయులు ఉద్యమించాలని పిలుపునిచ్చారు.

ఫ్యాప్టో నాయకులు పి.సుబ్బరాజు మాట్లాడుతూ సమస్యలపై ఉపాధ్యాయులందరూ ఐక్యంగా ఉద్యమించాలని పిలుపునిచ్చారు. ఫ్యాప్టో కో-చైర్మన్ మరియు యుటియఫ్ జిల్లా ప్రధానకార్యదర్శి టి. కామేశ్వరరావు మాట్లాడుతూ ఉపాధ్యాయుల పట్ల, ఉపాధ్యాయ సంఘాల పట్ల విద్యాశాఖాధికారుల నిరంకుశ వైఖరి విడనాడాలని డిమాండ్ చేశారు.

యుటియఫ్ తూర్పుగోదావరి జిల్లా అధ్యక్షులు ఎస్.జ్యోతిబసు మాట్లాడుతూ ఈరోజు జరుగుతున్న పోరాటానికి స్పందించి, విద్యాశాఖ సమస్యలు పరిష్కరించకుండ వుంటే పోరాటాన్ని మరింత ఉధృతం చేస్తామని అన్నారు. ఫ్యాప్టో భాగస్వామ్య సంఘ నాయకులు శివప్రసాద్, రవి, నాగేశ్వరరావు, తానీషా, వెంకట్రాజు, ఫిలిప్ రాజు, సివివి సత్యనారాయణ, వీర్రాజు తదితరులు మాట్లాడారు. ఫ్యాప్టో సెక్రటరీ జనరల్ టి.వెంకట్రావు పోరాటాన్ని విజయవంతం చేసిన ఉపాధ్యాయులకు ధన్యవాదాలు తెలియజేశారు.

కృష్ణా

## డిఇఓ ఆఫీసు వద్ద ఉద్రిక్తత

విద్యాశాఖ అధికారుల ఏకపక్ష నిర్ణయాలు తీసుకుంటూ ఉపాధ్యాయులు, విద్యార్థుల భవిష్యత్తుతో చెలగాటమాడుతున్నారని ఫ్యాప్టో రాష్ట్ర నాయకులు, యుటియఫ్ రాష్ట్ర ప్రధానకార్యదర్శి పి.బాబురెడ్డి విమర్శించారు. ఉపాధ్యాయుల బదిలీల వెబ్ కౌన్సిలింగ్‌ను రద్దు చేయాలని, ఖాళీలన్నీ చూపాలని డిమాండ్ చేస్తూ ఫ్యాప్టో ఆధ్వర్యాన డిసెంబర్ 10న మచిలీపట్నంలోని కృష్ణా జిల్లా విద్యాశాఖాధికారి కార్యాలయాన్ని ముట్టడించారు.

ఈ ఆందోళనలో ఫ్యాప్టో రాష్ట్ర నాయకులు బాబురెడ్డి, పాండు రంగ వరప్రసాద్ మాట్లాడుతూ ఏకపక్షంగా వ్యవహరిస్తున్న అధికారుల వైఖరిని ఖండిస్తున్నామన్నారు. అప్రజాస్వామిక, నిరంకుశ వైఖరితో ఉపాధ్యాయులు రొడ్డెక్కాల్సి వచ్చిందన్నారు. కొత్త ఉపాధ్యాయులతో ఖాళీలను భర్తీ చేయకుండా, ఉన్న ఉపాధ్యాయులను రేషన లైజేషన్ పేరుతో కుదించడం సరికాదన్నారు. ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించకపోతే ఉద్యమాన్ని మరింత తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు.

ఈ కార్యక్రమంలో రాష్ట్ర కో-చైర్మన్లు శరత్‌చంద్ర, రాజేంద్ర ప్రసాద్, జిల్లా చైర్మన్ ఇ.వి.రామారావు, సెక్రటరీ జనరల్ టి.నాగరాజు, కో-చైర్మన్లు ఎస్‌పి మనోహర్ కుమార్, కె.ప్రసాద్, వివిధ సంఘాల నాయకులు, ఉపాధ్యాయినీ ఉపాధ్యాయులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

ప్రకాశం

## వెబ్ కౌన్సిలింగ్ పెనుభారం

వెబ్ కౌన్సిలింగ్ స్థానంలో మ్యానువల్ కౌన్సిలింగ్ నిర్వహించాలంటూ డిమాండ్ చేస్తూ ఉపాధ్యాయులు జిల్లా విద్యాశాఖ కార్యాలయాన్ని ముట్టడించారు. పోలీసులు వారిని నిలువరించేందుకు యత్నించినా సాధ్యపడలేదు. డి.ఇ.ఓ కార్యాలయం వద్ద వారిని నిలిపివేయడంతో అక్కడే బైఠాయించి ఉపాధ్యాయులు ఆందోళన కొనసాగించారు. ఫ్యాప్టో ప్రకాశం జిల్లా సెక్రటరీ జనరల్ కీర్తి మాట్లాడుతూ వెబ్ కౌన్సిలింగ్ ఉపాధ్యాయులకు తలకు మించిన భారంగా మారుతోందన్నారు. పలుమార్లు రాష్ట్ర విద్యాశాఖ మంత్రితో చర్చించినా ఫలితం లేకుండా పాయిందని, పట్టుదల వీడకపోతే ఫ్యాప్టో ఆధ్వర్యంలో ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామన్నారు. ఫ్యాప్టో చైర్మన్ యస్.రవి మాట్లాడుతూ పోస్టులను బ్లాక్ చేయకుండా మొత్తంఖాళీలను బహిర్గతం చేయాలని డిమాండ్ చేశారు.

ఈ ధర్నాలో ఫ్యాప్టో కో చైర్మన్ ఎం.రామాంజనేయులు, ఓ.వి. వీరారెడ్డి, కె.లక్ష్మినారాయణ, ఈ.వి. రమణయ్య, పి.వెంకట్రావు, ఎన్.శరత్ బాబు, జి.సాయి మరియు ఉపాధ్యాయులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

కర్నూలు

## బదిలీల్లో ఖాళీలన్నీ చూపించాలి

ఉపాధ్యాయుల బదిలీల పట్ల విద్యాశాఖ వ్యవహరిస్తున్న తీరును ఎండగడుతూ ఉపాధ్యాయ సంఘాల సమైక్యంగా ఇచ్చిన పిలుపు మేరకు డిసెంబర్ 10న డిఇఓ కార్యాలయాన్ని ముట్టడించారు. వందలాదిమంది ఉపాధ్యాయులు పాల్గొని కార్యాలయాన్ని దిగ్భంధించారు. జిల్లా నలుమూలల నుండి పెద్దఎత్తున వందలాదిమంది ఉపాధ్యాయులు ముట్టడిలో పాల్గొన్నారు. రాష్ట్ర నేతలు ప్రకాశరావు, హృదయరాజు, కె.సురేష్‌కుమార్, మాణిక్యరాజు, రత్నం, ఏసేపు, తిమ్మన్న, నాగమణిలు మాట్లాడారు. ఉపాధ్యాయుల బదిలీల్లో ఖాళీలన్నింటిని వెంటనే చూపించాలని డిమాండ్ చేశారు.

వెబ్‌కౌన్సిలింగ్ రద్దుచేసి అన్ని కేడర్ల వారికి మాన్యువల్ కౌన్సిలింగ్ విధానాన్ని అమలు చేయాలని, సర్వీస్‌కు సంవత్సరానికి ఒక పాయింట్ చొప్పున కేటాయించాలని, అధికారులు నిరంకుశ విధానాలను విడనాడి ప్రజాస్వామ్యయుతంగా ఉపాధ్యాయ సంఘాలతో సానుకూలంగా చర్చలు జరిపి, ప్రతి పాఠశాలలో రెండు ఉపాధ్యాయ పోస్టులు కొనసాగించాలని, హైస్కూల్‌లో విద్యార్థుల సంఖ్యకనుగుణంగా ఉపాధ్యాయ పోస్టులు కొనసాగించాలని డిమాండ్ చేశారు.

ఈ ముట్టడి కార్యక్రమానికి జిల్లా చైర్మన్ సుధాకర్ అధ్యక్షత వహించారు. ఫ్యాప్టో జిల్లా జనరల్ సెక్రటరీ రంగన్న, వివిధ సంఘాల అధ్యక్ష, ప్రధానకార్యదర్శులు రామశేషయ్య, గోకారి, ఇస్మాయిల్, ఎల్లప్ప, కృష్ణ, శివయ్య స్వామి, ప్రసాదు, ఓంకార్, మధురెడ్డి, తిమ్మప్ప, యోగీశ్వరుడు కూడా పాల్గొని మాట్లాడారు. యుటియఫ్ జిల్లా సీనియర్ నాయకులు జయరాజు, రవికుమార్, హేమంత్ కుమార్, తిమ్మన్న, హనుమంతు, మద్దిలేటి, నవీన్‌లతోపాటు పలు ఉపాధ్యాయ సంఘాల నాయకులు కూడా పాల్గొన్నారు.

అనంతపురం

## డిఇఓ కార్యాలయం ముట్టడి

అనంతపురం జిల్లాలో రాష్ట్ర ఫ్యాప్టో పిలుపుమేరకు సమస్యల పరిష్కారము కొరకై జిల్లా విద్యాశాఖ కార్యాలయాన్ని సభ్య సంఘాల నాయకులు, కార్యకర్తలు దాదాపుగా 1100మందిచే ముట్టడించడం జరిగింది. యుటియఫ్ జిల్లా అధ్యక్షులు, ఫ్యాప్టో చైర్మన్ జయచంద్రా రెడ్డి అధ్యక్షతన ముట్టడి కార్యక్రమం జరిగింది.

ఈ కార్యక్రమంలో యుటియఫ్ రాష్ట్ర కార్యదర్శి యం.సుధాకర్, ఫ్యాప్టో చైర్మన్ ఎస్.జయచంద్రారెడ్డి, యుటియఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్.వి.వి.రమణయ్యలు మాట్లాడుతూ విద్యాశాఖాధికారులు రాష్ట్రస్థాయిలో నిరంకుశ వైఖరితో ఉన్నారని, ఉపాధ్యాయుల మీద కక్ష్యసాధింపు ధోరణితో రకరకాల వింత జిఓలతో ఉపాధ్యాయులను ఇబ్బంది పెట్టే జిఓలు, ప్రోసీడింగ్స్‌లు ఇస్తూ ఇబ్బందులకు గురి చేస్తున్నారన్నారు. బదిలీల్లో ప్రభుత్వం, అధికారులు అనుసరిస్తున్న తీరుపై ముట్టడి కార్యక్రమాన్ని హాజరైన ఉపాధ్యాయులు తీవ్ర ఆగ్రహాన్ని చూపిస్తున్నారని, బదిలీల్లో అన్ని ఖాళీలు చూపాలని, వెబ్ కౌన్సిలింగ్ కాకుండా మాన్యువల్ కౌన్సిలింగ్ జరపాలని లేని పక్షంలో పెద్దఎత్తున ఉద్యమిస్తామని హెచ్చరించారు.

ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు సి.కె.నాగేంద్రబాబు, కె.నాగేంద్ర, సరళ, కోటీశ్వరప్ప, శ్రీనివాసులు, రామప్పచౌదరి, మోహన్‌బాబు, హనుమంతరెడ్డి, సుధాకర్, ఈశ్వరయ్య, ఓబులేసు, ప్రమీళ, దేవేంద్రమ్మ, ఫ్యాప్టో సభ్య సంఘాల నాయకులు పాల్గొన్నారు.

ఉద్యమవార్తలు

# జిల్లాల ప్రాతినిధ్యాలు

## గుంటూరు

### అవినీతిపరుడైన తెనాలి ఎంఇఓపై చర్యలు తీసుకోవాలి

అవినీతి కార్యకలాపాలకు పాల్పడుతూ, ఉపాధ్యాయులను ఇబ్బంది పెడుతూ, ప్రత్యేకించి మహిళా ఉపాధ్యాయులను వేధింపులకు గురిచేస్తున్న తెనాలి మండల విద్యాశాఖాధికారి ఎం.లక్ష్మీ నారాయణపై చర్యలు తీసుకోవాలని తెనాలి శాసన సభ్యులు ఏ.శివ కుమార్‌కి యుటియఫ్ జిల్లా నాయకులు మెమోరాండం ఇచ్చాం.

ఎంఇఓగా నియామకమైనప్పటినుంచీ ఆయన వ్యవహారశైలి వివాదాస్పదంగా ఉందని, ఉపాధ్యాయులను ఏదోఒక రూపంలో బెదిరించడం, ఎరియర్ బిల్లులు, ఎయిడెడ్ బిల్లులు, ప్రైవేట్ స్కూళ్ళ దగ్గర లంచాలు వసూలు చేసే పనిచేస్తున్నారని, ఇక మహిళా ఉపాధ్యాయులైతే చెప్పుకోలేని విధంగా మానసికంగా ఆవేదనకు గురవుతున్నారని ఎమ్మెల్యేకి ఫిర్యాదు చేయడం జరిగింది.

అదే సమయంలో మండల అభివృద్ధి అధికారి (ఎంపిడిఓ) కూడా ఎంఇఓ వ్యవహారశైలిపై వ్రాతపూర్వకంగా ఫిర్యాదు చేయడం జరిగింది.

ఎమ్మెల్యేను కలిసినవారిలో జిల్లా అధ్యక్ష, ప్రధానకార్యదర్శులు పి.ప్రేమ్‌కకుమార్, కె.నాగమల్లేశ్వరరావు, రాష్ట్ర సహాధ్యక్షులు ఎన్.వెంకటేశ్వర్లు, జిల్లా సహాధ్యక్షులు బి.ఆదిలక్ష్మి, జిల్లా కార్యదర్శులు ఎం.డి.గయాసుద్దౌలా, కె.సాంబశివరావు, డి.సందీప్, విశ్వనాధ్ తదితరులు పాల్గొన్నారు.

### ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలి

బదిలీలకు సంబంధించి బ్లాక్ చేసిన పోస్టులు, ఎక్కువమంది పిల్లలు ఉన్న పాఠశాలల్లో బ్లాక్ లేకుండా చూడాలని డిఇఓకు యుటియఫ్ జిల్లాశాఖ ప్రాతినిధ్యం చేశారు. కోవిడ్‌కు గురువుతున్న పాఠశాలల పిల్లలు, ఉపాధ్యాయుల సమస్యలపై కూడా ప్రాతినిధ్యం చేయడం జరిగింది. 2021లో ఉద్యోగ విరమణ చేసే ఉన్నత పాఠశాలల ఉపాధ్యాయుల రిటైర్మెంట్ ఉత్తర్వులు ఇవ్వాలని కోరారు.

డిఇఓను కలిసిన వారిలో జిల్లా అధ్యక్ష, ప్రధానకార్యదర్శులు పి.ప్రేమ్‌కుమార్, కె.నాగమల్లేశ్వరరావు, రాష్ట్ర సహాధ్యక్షులు ఎన్.వెంకటేశ్వర్లు, జిల్లా కోశాధికారి ఎం.కళాధర్, జిల్లా కార్యదర్శి సిహెచ్.ఆదినారాయణ తదితరులు పాల్గొన్నారు.

## అనంతపురం

### మోడల్ స్కూల్ ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలి

అనంతపురం జిల్లాలో పనిచేయుచున్న మోడల్ స్కూల్ ఉపాధ్యాయులు అనేక సమస్యలు ఎదుర్కొంటున్నారని, వాటిని పరిష్కరించని పక్షంలో ఏపిఎంఎస్‌టిఎఫ్ మరియు యుటియఫ్ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఆందోళనా కార్యక్రమాలు చేపడుతామని తెలియజేస్తూ జిల్లా ఉప విద్యాశాఖాధికారి దేవరాజ్‌కి వినతిపత్రం ఇవ్వడమైనది.

ఈ సందర్భంగా ఏపిఎంఎస్‌టిఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు ఎస్.మురళీ మోహన్, యుటియఫ్ రాష్ట్ర కార్యదర్శి యం.సుధాకర్, జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్.వి.వి.రమణయ్యలు మాట్లాడుతూ జీతాల బిల్లులు ప్రతినెల 17లోగా ఇస్తున్నప్పటికీ, ఆలస్యంగా ట్రెజరీకి పంపి జీతాలు మొదటి తేదీన కాకుండా ఆలస్యంగా తీసుకుంటున్నారని, దాదాపుగా 200 మెడికల్, ఏఏఎస్, పెటర్నిటీ, పిఆర్‌సి అరియర్స్ తదితర బిల్లులు పెండింగ్‌లో పెట్టారని, మార్చి నెల డిఫర్మెంట్ బిల్లులు పెట్టలేదని, సర్వీస్ రిజిష్టర్లలో నమోదులు సరిగా లేవని, ఈ సమస్యలన్నీ పరిష్కరించాలని లేని పక్షంలో పెద్దఎత్తున ఆందోళనా కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించడమైనది.

ఈ కార్యక్రమంలో కోశాధికారి కోటేశ్వరప్ప, లింగమయ్య, అనిల్ కుమార్, ఏపిఎంఎస్‌టిఎఫ్ నాయకులు రమేష్, శివానంద, అలీమ్, వెంకటేష్ తదితరులు పాల్గొనడమైనది.

డిప్యూటీ డిఇఓ సమస్యలు పరిష్కరిస్తానని హామీ ఇవ్వడమైనది.

ఉపాధ్యాయుల బదిలీలు మాన్యువల్ కౌన్సిలింగ్‌లోనే జరపాలని, బదిలీలయందు అన్నీ ఖాళీలను చూపాలని కోరుతూ ఫ్యాప్టో ఆధ్వర్యంలో అనంతపురం అర్బన్ ఎమ్మెల్యే వెంకటరామిరెడ్డికి వినతి పత్రం ఇవ్వడమైనది.

ఫ్యాప్టో నాయకులతోపాటు జిల్లా ప్రధానకార్యదర్శి ఎస్.వి.వి.రమణయ్య, కోశాధికారి కోటేశ్వరప్పలు పాల్గొనడమైనది.

### మున్సిపల్ ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలి

యుటియఫ్ జిల్లా శాఖ ఆధ్వర్యంలో మున్సిపల్ పాఠశాలల్లో పనిచేయు ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలని మున్సిపల్ రీజినల్ డైరెక్టర్ (ఆర్.డి.) నాగరాజుకి వినతిపత్రం ఇవ్వడం జరిగింది.

ఈ సందర్భంగా జిల్లా అధ్యక్ష, ప్రధానకార్యదర్శులు జయచంద్రా రెడ్డి, రమణయ్యలు మాట్లాడుతూ గుంతకల్లు పురపాలక సంఘమందు పనిచేయు డిఎస్‌సి-2008, 2012 ఉపాధ్యాయులకు ఆలస్యంగా ప్రొబేషన్ పీరియడ్ డిక్లేర్ చేస్తూ కమీషనర్, గుంతకల్లు వారు ఉత్తర్వులు ఇచ్చారని వాటిని మార్చుతూ ఉత్తర్వులు ఇవ్వవలసిందిగా కోరడమైనది. అలాగే అనంతపురం జిల్లాలోని అన్ని పురపాలక/పట్టణ ప్రాంతాల్లో పనిచేయు అన్ని కేడర్ల ఉపాధ్యాయుల సర్వీస్, ప్రొబేషన్ పీరియడ్‌లు డిక్లేర్ చేయవలెనని కోరడమైనది. అలాగే మూతపడిన పాఠశాలల పున:ప్రారంభించిన వాటిలో విద్యార్థులు చేరుతున్నారని, అలాంటి పాఠశాలలకు డైస్‌కోడ్ కేటాయించాలని కోరారు.

ఈ కార్యక్రమంలో కోశాధికారి కోటేశ్వరప్ప, పట్టణ అధ్యక్ష, ప్రధానకార్యదర్శులు శ్రీనివాసులు, నాగేంద్ర, వెంకటనాయుడు తదితరులు పాల్గొన్నారు.

ఉద్యమవార్తలు

# సదస్సులు - సమావేశాలు

**పశ్చిమగోదావరి**

### యుటియఫ్ ఆధ్వర్యంలో ఘనంగా అంబేడ్కర్ వర్ధంతి

భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్ వర్ధంతిని యుటియఫ్ ఆధ్వర్యంలో భీమవరం అంబేడ్కర్ విగ్రహం వద్ద ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా యుటియఫ్ నాయకులు అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా యుటియఫ్ జిల్లా ప్రధానకార్యదర్శి బి.గోపీమూర్తి హాజరై మాట్లాడుతూ ప్రస్తుతం దేశంలోగాని, రాష్ట్రంలో గాని అంబేడ్కర్ రచించిన రాజ్యాంగ విలువలు తుంగలో తొక్కే విధంగా పరిణామాలు జరుగుతున్నాయని రాజ్యాంగాన్నే మార్చడానికి ప్రయత్నిస్తున్నారని ఆవేదన చెందారు.

ఈ కార్యక్రమంలో యుటియఫ్ జిల్లా కార్యదర్శి సిహెచ్.పట్టాభి రామయ్య, భీమవరం రూరల్ ప్రధానకార్యదర్శి కె.రామకృష్ణప్రసాద్, డి.ఏసుబాబు తదితరులు పాల్గొన్నారు.

**గుంటూరు**

### చెన్నుపాటి లక్ష్మయ్య జీవితం నేటి తరానికి ఆదర్శనీయం కావాలి

ఉపాధ్యాయ ఉద్యమానికి ఆద్యుడు, ఉపాధ్యాయ ఉద్యమ పితా మహుడుగా పిలువబడే చెన్నుపాటి లక్ష్మయ్య జీవితం అందరికీ ఆదర్శనీయం అని యుటియఫ్ నాయకులు కొనియాడారు.

ఉపాధ్యాయ ఉద్యమాన్ని ప్రారంభించిన చెన్నుపాటి లక్ష్మయ్య వర్ధంతి సందర్భంగా యుటియఫ్ జిల్లా కార్యాలయం డిసెంబర్ 10న కార్యక్రమం ఏర్పాటు చేశారు. కార్యాలయ ప్రాంగణంలో వున్న చెన్నుపాటి కాంస్య విగ్రహానికి రాష్ట్ర సహాధ్యక్షులు ఎన్.వెంకటేశ్వర్లు పూలమాలవేసి నివాళులర్పించారు. అనంతరం జరిగిన సభలో మాట్లాడుతూ ఉపాధ్యాయ వృత్తిని చేపట్టిన లక్ష్మయ్య ఆ రోజుల్లో స్వేచ్ఛగా సంఘాలు పెట్టుకునే వీలులేని పరిస్థితుల్లో నాయకత్వం వహించి సంఘాన్ని ప్రారంభించారన్నారు. ప్రభుత్వ అనుమతి లేకుండా సంఘాలు పెట్టుకోకూడదన్న 416 జీఓకు వ్యతిరేకంగా మద్రాసు హైకోర్టులో దావా వేసి, ఆ జీఓను రద్దు చేయించారన్నారు.

జిల్లా ప్రధానకార్యదర్శి కె.నాగమల్లేశ్వరరావు మాట్లాడుతూ ఎన్నో కష్టనష్టాలనెదుర్కొని ఉద్యమాలు నిర్మించి ఉపాధ్యాయులకు అనేక ఫలితాలను సాధించి పెట్టిన చెన్నుపాటి జీవితాన్ని అధ్యయనం చేసి ఆయన చూపిన మార్గంలో నడపాలన్నారు.

ఈ కార్యక్రమంలో జిల్లా సహాధ్యక్షులు బి.ఆదిలక్ష్మి, జిల్లా కోశాధికారి ఎం.కళాధర్, జిల్లా కార్యదర్శులు జి.వెంకటేశ&్వర్లు, ఎం.డి.షకీలాబేగం, సిహెచ్.ఆదినారాయణ, ఆడిట్ కమిటీ కన్వీనర్ ఎన్.వి.జగదీష్‌కుమార్, ఆడిట్ బాధ్యులు కె.ప్రభూజీ, వివిధ మండలాల బాధ్యులు కె.ప్రేమ్‌కుమార్, కె.వెంకటేశ్వర్లు, ఎం. గోవిందయ్య పాల్గొన్నారు.

### వ్యవసాయ చట్టాలను రద్దు చేయాలని రైతులు చేస్తున్న పోరాటానికి యుటియఫ్ మద్దతు

కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన వ్యవసాయ చట్టాలను రద్దుచేసి రైతాంగాన్ని రక్షించాలని యుటియఫ్ రాష్ట్ర కోశాధికారి కొమ్మోజు శ్రీనివాసరావు కోరారు. యుటియఫ్ గుంటూరు జిల్లా ఆఫీస్ బేరర్స్ సమావేశం బ్రాడీపేట యుటియఫ్ జిల్లా కార్యాలయంలో డిసెంబర్ 27న జిల్లా అధ్యక్షులు పి.ప్రేమ్‌కుమార్ అధ్యక్షతన జరిగింది.

ఈ సందర్భంగా కె.శ్రీనివాసరావు మాట్లాడుతూ రైతులకు ఆర్థిక సహకారాన్ని ఉపాధ్యాయులు అందించాలని కోరారు. యుటియఫ్ రాష్ట్ర సహాధ్యక్షులు ఎన్.వెంకటేశ్వర్లు మాట్లాడుతూ ఉపాధ్యాయుల బదిలీల ప్రక్రియలో వెబ్ వల్ల ఎదురవుతున్న ఇబ్బందులను గమనించి మాన్యువల్ కౌన్సిలింగ్ జరపాలని, బ్లాక్ పోస్టులను ఎత్తివేసి అన్ని పోస్టులను బదిలీలకు చూపాలని కోరారు. జరగబోయే టీచర్ ఎమ్మెల్సీ ఎన్నికలో పిడిఎఫ్ ఎమ్మెల్సీల అభ్యర్థుల విజయానికి సన్నద్ధం కావాలని, అలాగే ఎమ్మెల్సీ ఓటర్లుగా అర్హత కలిగిన వారందరూ ఓటర్లుగా చేర్చాలని కోరారు.

యుటియఫ్ జిల్లా ప్రధానకార్యదర్శి కె.నాగమల్లేశ్వరరావు, యుటియఫ్ జిల్లా అధ్యక్షులు పి.ప్రేమ్‌కుమార్ మాట్లాడుతూ మరిన్ని పోరాటాలకు ఉపాధ్యాయులు సన్నద్ధం కావాలని కోరారు. ఈ సమావేశంలో యుటియఫ్ జిల్లా గౌరవాధ్యక్షులు జి.విజయసారథి, సహాధ్యక్షులు బి.ఆదిలక్ష్మి, కోశాధికారి ఎం.కళాధర్, యుటియఫ్ రాష్ట్ర కార్యదర్శి ఏ.ఎన్.కుసుమకుమారి, జిల్లా కార్యదర్శులు దౌలా, బి.నరసింహారెడ్డి, సిహెచ్.శ్రీనివాసరావు, కె.తిరుపతిస్వామి, యుటియఫ్ రాష్ట్ర ప్రచురణల విభాగం కన్వీనర్ ఎం.హనుమంతరావు, జిల్లా ఆడిట్ కమిటీ కన్వీనర్ ఎన్.వి.జగదీష్ కుమార్, షకీలాబేగం, ఎస్‌విఎన్ నాగరాజు, జి.వెంకటేశ్వర్లు, వి.నాగేశ్వరరావు, వై.శ్రీనివాస రావు, హాబీబ్ తదితరులు పాల్గొన్నారు.

**ప్రకాశం**

### ఉపాధ్యాయ ఉద్యమ రథసారధి

అమరజీవి చెన్నుపాటి లక్ష్మయ్య 52వ వర్ధంతి సందర్భంగా ప్రకాశం జిల్లా శాఖ ఆధ్వర్యంలో ఒంగోలులోని యు.టి.యఫ్ కార్యాలయంలో చెన్నుపాటి లక్ష్మయ్యగారి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించడం జరిగింది.

ఈ కార్యక్రమంలో యు.టి.యఫ్ రాష్ట్ర కోశాధికారి కె.శ్రీనివాస రావు, జిల్లా అధ్యక్షులు యస్.రవి, జిల్లా కార్యదర్శి యన్.చిన్నస్వామి, మహిళా కార్యదర్శి జి.ఉమామహేశ్వరి గార్లు మరియు ఒంగోలు ప్రాంతీయ మండలాల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు, నాయకులు పాల్గొన్నారు.

**యర్రగొండపాలెం :** యర్రగొండపాలెం మండల యుటిఎఫ్ శాఖ ఆధ్వర్యంలో ఉద్యమ నిర్మాత అయినటువంటి చెన్నుపాటి లక్ష్మయ్య గారి వర్ధంతి కార్యక్రమాన్ని స్థానిక జడ్పీ హెచ్ఎస్ హైస్కూల్

నందు మండల యుటిఎఫ్ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించడం జరిగింది ఈ కార్యక్రమంలో మండల అధ్యక్ష కార్యదర్శులు మరియు జిల్లా నాయకులు మరియు సీనియర్ నాయకులు కార్యకర్తలు అందరూ పాల్గొని ఈ కార్యక్రమాన్ని జయప్రదం చేయడం జరిగింది.

**గిద్దలూరు :** గిద్దలూరు మండల యు.టి.యఫ్ కార్యాలయంలో ఉపాధ్యాయ ఉద్యమ పితామహుడు చెన్నుపాటి లక్ష్మయ్య వర్ధంతి సభను నిర్వహించడం జరిగినది.

ఈ కార్యక్రమంలో విశ్రాంత ఉద్యోగుల సంఘం అధ్యక్షులు జి.రవీంద్రనాథరెడ్డి గారు, పి.రమణారెడ్డి,రాష్ట్రకార్యదర్శి, బి.రంగారెడ్డి, జిల్లా కార్యదర్శి, గిద్దలూరు, రాచర్ల, కొమరోలు మండలాల అధ్యక్ష, కార్యదర్శులు మరియు కార్యకర్తలు పాల్గొన్నారు. రవీంద్రనాథరెడ్డి గారు చెన్నుపాటి జీవితాన్ని గురించి వారు ఉపాధ్యాయ లోకానికి చేసిన సేవల గురించి వివరించారు.

**కనిగిరి :** యుటియఫ్ కనిగిరి డివిజన్ ఆఫీసులో చెన్నుపాటి లక్ష్మయ్య వర్ధంతి సభ జరిగింది. ఈ సమావేశమునకు ముఖ్యఅతిధిగా కె.కృష్ణమూర్తి హాజరు అయ్యారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి షేక్ ఖాజారహంతుల్లా, జిల్లా ఆడిట్ కమిటి కన్వీనర్ యం రాము, యన్.యఫ్.డబ్ల్యు.టి అధ్యక్షురాలు జి.వి.సుబ్బరత్నం కనిగిరి వెలిగండ్ల హెచ్.యం.పాడు, పి.సి పల్లి అధ్యక్షులు ప్రధాన కార్యదర్శులు కార్యకర్తలు జె.వి.వి జిల్లా అధ్యక్షులు షేక్ ఖాజాహుస్సేన్ గారు హాజరైరి. ఈ సందర్భంగా బ్లడ్ గ్రూపింగ్ క్యాంపు నిర్వహించారు.

**మార్కాపురం :** మార్కాపురం యు.టి.యఫ్ ప్రాంతీయ కార్యాలయంనందు అమరజీవి చెన్నుపాటి లక్ష్మయ్య వర్ధంతి సందర్భంగా వారికి ఘనంగా నివాళులు అర్పించారు.

ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి ఓ.వి.వీరారెడ్డి, ప్రాంతీయ మండలాల యు.టి.యఫ్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు, యు.టి.యఫ్ కార్యకర్తలు, నాయకులు మరియు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

**కడప**

## ఖాళీలను బ్లాక్ చేయడం అన్యాయం

ఉపాధ్యాయ బదిలీల సందర్భంగా ఖాళీలను అన్నింటిని ప్రదర్శించాలని, ఖాళీలను బ్లాక్ చేసే ఆలోచన విరమించుకోవాలని యుటియఫ్ రాష్ట్ర కార్యదర్శి లక్ష్మీరాజ డిమాండ్ చేశారు. యుటియఫ్ జిల్లా కార్యాలయంలో ముఖ్య నాయకుల సమావేశంలో మాట్లాడుతూ సాధారణ బదిలీలు జరుపుతూ ఖాళీలను బ్లాక్ చేయడం అర్థంలేని చర్య అని అన్నారు.

వెబ్ కౌన్సిలింగ్ కాకుండా మాన్యువల్ కౌన్సిలింగ్ జరపాలని ఎంత కోరినా మొండిగా వ్యవహరించడం తగదన్నారు. కనీసం యస్జిటి ఉపాధ్యాయులకైనా మాన్యువల్ కౌన్సిలింగ్ జరపాలని లేని పక్షంలో ఉపాధ్యాయులు ఉద్యమాలకు సిద్ధంగా ఉండాలని పిలుపునిచ్చారు.

ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్ష, ప్రధానకార్యదర్శులు హరిప్రసాద్ జాబిర్, జిల్లా కార్యదర్శులు మహేష్‌బాబు, గంగన్న, దావుద్దీన్ నాయకులు బాబు పాల్గొన్నారు.

## ప్రీ ఆడిట్ బిల్లులను వెంటనే పరిష్కరించాలి

జిల్లాలోని ఉపాధ్యాయులకు సంబంధించిన ఆటోమేటిక్ అడ్వాన్స్‌మెంట్ స్కేల్ బిల్లులు వివిధ ప్రాంతాల ఉప ఖజానా కార్యాలయాల నుండి ముందస్తు ఆడిట్ కొరకు జిల్లా ఖజానా కార్యాలయంలో కు నిబంధనల మేరకు పంపిస్తున్నారని,కానీ జిల్లా ఖజానా కార్యాలయంలో ఆడిట్ అధికారి వాటిని పరిష్కరించడంలో నిర్లక్ష్యంగా వ్యవహరించడమే కాకుండా వచ్చిన బిల్లులను ఒక క్రమ పద్ధతిలో కాకుండా ఇష్టమొచ్చిన విధంగా పరిష్కరించడంతో అనేక అనుమానాలకు తావిస్తోందని యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి లక్ష్మీ రాజా ఆరోపించారు.

యుటియఫ్ జిల్లా కార్యాలయంలో జరిగిన ముఖ్య నాయకుల సమావేశంలో మాట్లాడుతూ నిబంధనలకు విరుద్ధంగా అన్నిరకాల ఆటోమేటిక్ అడ్వాన్స్ మెంట్ స్కేల్ బిల్లులను ముందస్తు ఆడిట్ కు పంపించి వేధింపులకు గురి చేయడం దుర్మార్గపు చర్య అన్నారు.

విశ్రాంత ఉద్యోగుల పెన్షన్ బిల్లులు కూడా జిల్లా ఖజానా కార్యాలయంలో బాగా ఆలస్యం చేస్తూ రిటైర్ అయిన ఉద్యోగులను ఇబ్బంది పెట్టడం సరైంది కాదని,జిల్లా ఖజానా అధికారి వెంటనే జోక్యం చేసుకుని పరిష్కరించాలని లేని ఎడల ఉద్యమం తప్పదని అన్నారు.

ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు హరిప్రసాద్, జాబిర్ జిల్లా సహాధ్యక్షురాలు రూత్ ఆరోగ్య మేరి జిల్లా కోశాధికారి మస్తానయ్య,జిల్లా కార్యదర్శులు మహేష్బాబు నరసింహారావు సి పి యస్ జిల్లా కన్వీనర్ మురళి ఆడిట్ కమిటీ కన్వీనర్ రమణ వివిధ మండలాల నాయకులు సుజిత్,నాగేశ్వరరావు, శివవరప్రసాద్, బాబు, వీరనారాయణ ఇబ్రహీం, చెన్నకేశవులు, అయ్యవారురెడ్డి, మస్తాన్ భాషా పాల్గొన్నారు.

**కర్నూలు**

## ఉపాధ్యాయ ఉద్యమ కర్త

**సంజామల :** ఉపాధ్యాయ ఉద్యమ కర్త చెన్నుపాటి లక్ష్మయ్య డిసెంబర్ 10న వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా యుటియఫ్ జిల్లా కార్యదర్శి బాబా ఫక్రుద్దీన్ మాట్లాడారు. ఈ నెల 10న చేపట్టే డిఇఓ కార్యాలయ ముట్టడిలో ఉపాధ్యాయులు, నాయకులు పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. నాయకులు రామిరెడ్డి, లక్ష్మి, రమాదేవి పాల్గొన్నారు.

**అనంతపురం**

## చెన్నుపాటి లక్ష్మయ్యగారి ఉద్యమ స్ఫూర్తితో నడుద్దాం

ఉపాధ్యాయ ఉద్యమ పితామహుడు, మాజీ ఎమ్మెల్సీ శ్రీ చెన్నుపాటి లక్ష్మయ్య గారి 52వ వర్ధంతి కార్యక్రమాన్ని జిల్లా కార్యాలయంలో గౌరవాధ్యక్షులు నాగేంద్ర అధ్యక్షతన డిసెంబర్ 10న యుటియఫ్ జిల్లా పక్షాన నిర్వహించారు.

ఈ సందర్భంగా రాష్ట్ర కార్యవర్గ సభ్యులు జిలాన్, జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్.వి.వి.రమణయ్య, నాగేంద్ర, కోటేశ్వరప్పలు మాట్లాడుతూ ఉపాధ్యాయులు సమాజంలో భాగంగా వుండాలని వారి కష్టసుఖాలలో పాలుపంచు కోవాలని చెన్నుపాటి దిశానిర్దేశం చేశారు. యుటియఫ్ ఆ సామాజిక స్పృహతోనే పనిచేస్తున్నది. ప్రజాతంత్ర పని విధానం నుండే సమిష్టి పని విధానం అలవడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి లింగమయ్య, ఆడిట్ కన్వీనర్ అనిల్ కుమార్‌లు పాల్గొన్నారు.

ఉద్యమవార్తలు

# సావిత్రీబాయి జయంతి వేడుకలు

**విజయనగరం**

### సావిత్రిబాయిపూలే సమాజానికి ఆదర్శనీయురాలు

